వీక్షణం

ఆర్థిక, సామాజిక పక్షపత్రిక

సంపుటి: 1 సంచిక: 6
ఫిబ్రవరి 1-15, 2004

సమతా పబ్లికేషన్స్ ప్రచురణ

పేజీలు : 24
వెల: రూ.6-00

లోపలి పేజీల్లో...

విడి ప్రతి : రూ॥ 6/-
వార్షిక చందా : రూ॥ 140/-లు

సంపాదకీయం:

అందరూ నిర్దోషులే!

న్యాయ వ్యవస్థ మీద ప్రపంచీకరణ ప్రభావం కార్మికుల సమ్మెహక్కును తిరస్కరించినప్పటి నుంచి బహిరంగంగా అందరి అనుభవంలోకి వస్తూనే ఉంది. ప్రపంచీకరణ పాలకవర్గ ప్రయోజనాలు కలిసిపోయినప్పుడు న్యాయస్థానాలు మరింత నగ్నంగా అన్యాయస్థానాలుగా ఎలా మారతాయో ఇటీవల ఉదాహరణలు చూపుతున్నాయి. ఇపుడు సమస్య నీతి-అవినీతిదో న్యాయ-అన్యాయాలదో కాదు. నేరానికి, అవినీతికి, అన్యాయానికి పాల్పడిన వాళ్ళు అధికార పీఠాల్లో ఉంటే చాలు. అధికారమే అన్నింటికి గీటురాయి. అధికారంలో ఉంటే ఎంతటి భయంకరమైన నేరంలో నుంచైనా నిర్దోషిగా బయటపడవచ్చు. అధికారాన్ని వ్యతిరేకించే వాళ్లనైతే అసలు నేరమే చేయకపోయినా శిక్షకు గురిచేయవచ్చు.

లఖుబాయి పాఠక్ కేసునుంచి పి.వి. నర్సింహారావు విముక్తి, బోఫార్సుకేసు నుంచి రాజీవ్ గాంధీ విముక్తి, శవపేటికల కేసులో న్యాయమూర్తి విచారణ నుంచి జార్జిఫెర్నాండెజ్ విముక్తి మొదలైనవన్నీ అత్యున్నత విచారణ పీఠాలలో కూచున్నవాళ్లు వేమన చెప్పినట్లు 'పసిడి గల్గువాని బానిస కొడుకులు' అనే మాటను నిజం చేస్తున్నాయి. వీటిలో లఖుబాయి పాఠక్ కేసులో సాక్ష్యాలు తారుమారై ఉండవచ్చు. నేరం నిర్ధారించడానికి సాక్ష్యాలు సరిపోక పోవచ్చు. కాని బోఫార్స్ కేసులోనూ జార్జి ఫెర్నాండెజ్ కేసులోనూ లెక్కలేనన్ని సాక్షాలున్నాయి. బోఫార్సుకేసులోనైతే చివరి పోటీలో నిలబడిన నాలుగు శతఘ్నులలో నాణ్యత ప్రమాణాలలో చిట్ట చివరిదిగా ఉండిన బోఫార్స్‌ను కొనడానికి ఎన్ని బహుళజాతి సంస్థలు ఎన్ని ప్రభుత్వాలు కుట్రలు చేసాయో, ఎన్నికోట్ల రూపాయల డబ్బు చేతులు మారిందో ఎన్ని బినామీ కంపెనీలు పుట్టుకొచ్చి సొమ్ము కైంకర్యం చేసి స్విస్ బ్యాంకులో లావాదేవీలు నడిచి తెరమరుగయ్యాయో ప్రతి ఒక్క అంశం బోలెడన్ని సాక్ష్యాధారాలతో నిర్ధారించబడింది. మనుషుల స్థితి గతులో, మంచి చెడులో కాక కేవలం సాక్ష్యాధారాలే న్యాయదేవత త్రాసులో తూగుతాయన్నప్పుడు హిందుజాల మీద, రాజీవ్‌గాంధీ మీద, బోఫార్స్ మీద సాక్ష్యాధారాలకు కొదవలేదు. అయినా మహాఘనత వహించిన ధర్మాసనం రాజీవ్‌గాంధి నిర్దోషిత్వాన్ని ప్రకటించింది. ఇంకా ఒక అడుగుముందుకు వేసి హిందూజాలు మోసం చేసిన మాట నిజమే కాని అవినీతికి పాల్పడలేదని తీర్పు చెప్పింది. బోఫోర్సు శతఘ్నులకు కొన్ని వందల రూపాయలు అనవసరంగా ఎక్కువగా చెల్లించవలసి వచ్చిందని అందులో అరవై కోట్ల రూపాయిలు లోటస్ పేరుతో ఉన్న ఖాతాలోకి జమ అయ్యాయని, లోటస్ అంటే రాజీవ్ అని స్వీడన్, స్విట్జర్లాండ్, బ్రిటన్‌లలో ఎంతో పరిశోధన చేసి పత్రికలలో అచ్చయిన సాఖ్యాధారాలన్నింటిని న్యాయస్థానం ఒక్కమాటతో రద్దు చేసేసింది. ఆ సాక్ష్యాధారాలన్నింటినీ కనిపెట్టడంలో, అచ్చు వేయడంలో అప్పుడు ప్రధాన పాత్ర వహించిన పాత్రికేయుడు అరుణ్ శౌరి ఇవాళ కేంద్ర ప్రభుత్వంలో ముఖ్యమైన కేబినేట్ మంత్రి. ఇటు భారతీయ జనతాపార్టీ అయినా అటు కాంగ్రెసైనా ప్రజాధనం దుర్వినియోగం, కైంకర్యంలో ఒకే రకమైన వైఖరి ప్రదర్శిస్తాయనడానికి ఇదే నిదర్శనం.

రక్షణ శాఖ వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు అవినీతి జరుగుతున్నాయని బోఫోర్స్ ఉదంతం బయట పెట్టిన వాస్తవాన్ని దాదాపు 20 సంవత్సరాల తర్వాత తెహల్కా మరోవైపు నుండి రుజువుచేసింది. రక్షణ మంత్రి ఇంట్లో అనుచరులు స్వయంగా డబ్బులు తీసుకుంటూ తెహల్కా కెమేరాకు దొరికిపోయారు. అయినా సరే రక్షణ మంత్రికి ఆ అవినీతిలో పాత్ర లేదని న్యాయవిచారణ పక్రటిస్తుంది. న్యాయవ్యవస్థ కూడా ప్రజలను పీడించే రాజ్యాంగ యంత్రంలో ఒక భాగమేనని, మిగిలిన రెండు వ్యవస్థల కన్నా భిన్నంగా స్వతంత్రంగా ఉన్నట్లు న్యాయ వ్యవస్థ చేసే నటన అంతా డొల్లయేనని, నిజంగా సవాలు ఎదురైనపుడు న్యాయవ్యవస్థ కూడా ప్రజల వైపు నిలబడదని, ప్రజాధనం దుర్వినియోగాన్ని, ప్రజల సార్వభౌమాధికారాన్ని కాపాడదని తేలిపోయింది. అటు సంపదని రక్షించుకునే బాధ్యత, తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకునే భాధ్యత ప్రజలది మాత్రమే. ఎన్ని న్యాయస్థానాలు ఎన్ని నిర్దోషిత తీర్పులు ప్రకటించినా నిజమైన నేరస్థులు, దోషులు, అవినీతిపరులు ప్రజల దృష్టి నుంచి తప్పించుకోజాలరు.

పంచాయతీరాజ్ సంస్థలకు గ్రాంట్లు (రు.కోట్లు)

సంవత్సరం	రాష్ట్ర ప్రభుత్వ పన్ను, పన్నేతర ఆదాయం	కేంద్ర గ్రాంట్లతో సహా పంచాయతీ సంస్థలకు విడుదలైన గ్రాంట్లు	రాష్ట్ర రెవెన్యూలో పంచాయతీరాజ్ గ్రాంట్ల శాతం
1987-88	2199.02	663.98	30.19
1988-89	2464.74	761.52	30.89
1989-90	2804.37	870.63	31.04
1990-91	3101.62	812.26	26.18
1991-92	3689.40	1111.20	30.11
1992-93	4006.66	1412.72	35.25
1993-94	4748.98	1447.28	30.47
1994-95	5176.09	1373.51	26.53
1995-96	6678.77	1545.41	23.14
1996-97	7950.71	1712.05	21.53
1997-98 (*బడ్జెట్ అంచనా*)	8559.49	2123.65	23.70

గ్రామ పంచాయతీలకు విడుదలైన గ్రాంట్లు (రు.లక్షలలో)

సంవత్సరం	గ్రాంట్లు
1989-90	1049.67
1990-91	746.82
1991-92	1420.75
1992-93	1507.25
1993-94	2751.33

జె.ఆర్.వై. నిధుల ద్వారా గ్రామపంచాయతీలకు ఆదాయం

సంవత్సరం	గ్రామపంచాయతీల మొత్తం ఆదాయం (రు. కోట్లు)	జె.ఆర్.వై. గ్రాంట్లు (రు.కోట్లు)	మొత్తం ఆదాయంలో జె.ఆర్.వై. శాతం	జె.ఆర్.వై. నిధులతో తలసరి ఆదాయం	జె.ఆర్.వై. నిధులు లేకుండా ఆదాయం
1989-90	230.91	115.28	62.91	56.59	20.98
1990-91	191.28	111.55	58.32	46.88	19.54
1991-92	213.29	114.62	49.55	44.56	22.47
1992-93	220.77	111.79	50.63	42.53	20.99
1994-95	242.81	115.81	47.63	46.78	24.44

వ్యవసాయంపై బ్యాంకుల సవతితల్లి ప్రేమ

స్థూలరాష్ట్రోత్పాదాయానికి 26 శాతం ఆదాయాన్ని, 61శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగానికి బ్యాంకులు 01-02లో ఇచ్చిన రుణం కేవలం రు.765 కోట్లు మాత్రమే. అదే సమయంలో ప్రాధాన్యేతర రంగాలకు, అంటే పరిశ్రమలు, వ్యాపారం వగైరాలకు ఇచ్చిన రుణం రు.28,764 కోట్లు. రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ రాకేష్ మోహన్ స్వయంగా ఇచ్చిన గణాంకాలు ఇవి. ఇది వ్యవసాయాన్ని వెన్నుపోటు పొడవడం గాక మరేమిటి? అయినా ఇదేదో 01-02లోనే జరిగిన అన్యాయం కాదు. సంస్కరణలు ప్రారంభించినప్పటి నుంచీ జరుగుతున్నదే. మరి రిజర్వు బ్యాంకు ఏం చేస్తుంది? ఉపన్యాసాలు, కమిటీల ఏర్పాటేనా? వ్యవసాయానికి రుణసదుపాయం గురించి ఇప్పటికి ఎన్నో కమిటీలు నియమించటం, సిఫార్సులు చేయటం, ఒకటీ అరా అమలుపరచటం, పరిస్థితి మళ్లీ పాతగాడిలోనే నడుస్తుండటం ఇది చర్విత చరణంగా నడుస్తూనే ఉంది.

బ్యాంకులిచ్చే రుణాల్లో 40 శాతం ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాలని, అందులో 18 శాతం వ్యవసాయానికే ఇవ్వాలనేది ప్రభుత్వ నిర్ణయం. కాని బ్యాంకులు ఏనాటి నుంచో, ముఖ్యంగా సంస్కరణల తర్వాత ఆ 18 శాతం కూడా ఇవ్వలేకపోతూ వచ్చాయి. అందుకు కారణాలను విశ్లేషించి కచ్చితంగా 18 శాతం ఇచ్చేలా చూడాల్సిందిపోయి, 18 శాతం ఏ మేరకు తక్కువ ఇచ్చారో, ఆ తక్కువ మొత్తాన్ని ఆర్‌డిఎఫ్‌లో జమచేసి, ఆ డబ్బును గ్రామాల్లో ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేయమని నిర్ణయించటంలోనే వ్యవసాయానికి రుణం అందకపోయినా ఫర్వాలేదు అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. గత మూడు సంవత్సరాలుగా 15 శాతం వద్దనే రుణసౌకర్యం నిలిచిపోయింది. కార్లు, స్కూటర్లు, వినిమయ విలాసవస్తువులు కొనుక్కోవటానికి బ్యాంకులు ధారాళంగా విరాళాలిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు పోటీపడి వడ్డీరేట్లు తగ్గిస్తున్నారు కూడా. కాని రైతులకు రుణాలివ్వాల్సి వచ్చేసరికి కమిటీల నియామకంతో కాలం వెళ్లబుచ్చుతోంది. బహుశా మరింతమంది రైతులు, వ్యవస్థాగత రుణాలు లభించక, ఆత్మహత్యలకు పాల్పడాలని పాలకులు ఆశిస్తున్నారేమో. రైతులకు వడ్డీలో 9శాతం కన్నా తగ్గించాలని, బ్యాంకులను ఆలోచించమని ఆర్థికమంత్రి జస్వంత్ 'సలహా' ఇచ్చారు. వ్యవసాయం అంటే ఎంత చిన్నచూపో చూశారుగా!

× × ×

నీటిపారుదల రంగానికి నిధులు నదీ ప్రవాహంలా ప్రవహిస్తున్నాయని, 12 లక్షల ఎకరాలకు అదనంగా నీరు అందించమని చెవులు చిల్లులు పడేలా ప్రచారం చేస్తుంది తెలుగుదేశం. తమ ప్రభుత్వం రైతాంగానికి వండి వారగబోస్తుందని చెప్పుకొంటే, ఎన్నికల సమయంలో ప్రచారం కోసం చెప్పుకుంటుంది పోనీ అనుకోవచ్చు. కాని కాంగ్రెస్ పాలనలో చాలా తక్కువ కేటాయించారని చెప్పాల్సిన పని ఏమిటి? పోనీ, అలా చెప్పినపుడు కాస్త చెకప్ చేసుకోవాలి కదా? ఎంత డబ్బు ఖర్చుపెట్టారని కాదు, ఎన్ని ఎకరాలకు నీరందించే ఏర్పాటు చేశారు, ఎన్ని ఎకరాలకు వాస్తవంగా నీరందించుతుంది అనేది ముఖ్యం. ఎకనామిక్ సర్వే ఈ వివరాలేమిటో అని తిరగేయంగా తెలుగుదేశం తలకిందులుగా పెట్టిచూస్తుందేమోననిపిస్తుంది. ఈ గణాంకాలు చూడండి. (ల.హె.)

ప్రణాళిక	నీటిపారుదల స్థాపిత శక్తి	వాస్తవంలో నీటి వినియోగం
నాలుగవ (69-74)	2.530	2.800
అయిదవ (74-78)	2.933	2.667
ఆరవ (80-85)	3.866	2.526
ఏడవ (85-90)	1.560	1.421
ఎనిమిదవ (92-97)	0.706	0.613
తొమ్మిదవ (97-02)	2.376	-

(ఎకనామిక్ సర్వే 02-03)

పై గణాంకాల ప్రకారం 1980 వరకు కాంగ్రెస్ పాలనలో రెండున్నర ల.హె. నుంచి సుమారు 4 ల.హె. వరకు నీటిసౌకర్యం కల్పించగా, 85-90 మధ్య, అంటే తెలుగుదేశం పాలనలో ఒకటిన్నర ల.హె.కు పడిపోయింది. ఆ తర్వాత 92-97 మధ్య, అంటే సగం కాలం కాంగ్రెస్, సగం కాలం దేశం పాలనలో 0.7 ల.హె.కు తగ్గిపోయింది. ఊడబొడిచేశామని ప్రచారం చేసుకుంటున్న 97-02 మధ్యకాలంలో నాలుగు, అయిదు, ఆరు ప్రణాళికల కాలంలో సాధించిన స్థాయికి చేరుకోలేకపోయింది. మరి, ఈ 12 లక్షల ఎకరాలు సృష్టి ఎవరిది? అబద్ధం ఆడితే గోడ కట్టినట్లుండాలి గాని తడిక కట్టినట్లుండ కూడదని పెద్దలంటారు.

- విహారి

ప్రజల డబ్బుతో ఫలహారాల పందేరాలు

- వి.హనుమంతరావు

ఏవైనా వస్తువులు వేలంపాట పాడేటపుడు ఒకటోసారి, రెండోసారి అని మూడోసారి పాట కొట్టేస్తారు. కాషాయ ప్రభుత్వం కూడా ఇదివరకే రెండు విడతలుగా వరాల జల్లులు కురిపించింది. ఇపుడు తాత్కాలిక బడ్జెట్ ద్వారా మూడోవిడత కురిసింది. పార్లమెంట్‌ను ఆరవతేదీన రద్దు చేయాలనే నిర్ణయం చేసేశారు కాబట్టి మూడోసారితో ప్రజల ఆస్తుల వేలంపాట కట్. అవును తనది కాకపోతే తాటిమట్టకెదురు దేకమన్నట్లు ప్రభుత్వం వద్ద, బ్యాంకుల్లో ఉన్న నిధులు వాజ్‌పేయ్ సొంత జేబులో నుంచి కావు. ప్రజల దబ్బు కాబట్టి చేతికెముక లేకుండా దానధర్మాలు చేసేయవచ్చునా?

ప్రభుత్వం ఇలాంటి పనులేమైనా చేయదలచుకొంటే బడ్జెట్‌లో ప్రతిపాదించి, నెలరోజులపాటు చర్చించి, ప్రజాప్రతినిధులకు కూలంకషంగా చర్చించే అవకాశం ఇచ్చి, పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాతనే అమలుపరచటం జరుగుతుంది. అయితే తాత్కాలిక బడ్జెట్ కూడా పార్లమెంటు ముందర ప్రతిపాదించాం కదా అని అనవచ్చు. కాని ప్రశ్న ఏమంటే తాత్కాలిక బడ్జెట్ పరిధులు చాలా పరిమితం. వార్షిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు చాలకపోతే, లేక అనుకొని ఖర్చులు వచ్చిపడితేనో వాటికి కేటాయింపులు చేసి పార్లమెంటు అనుమతి పొందటం మామూలుగా జరిగే పద్ధతి. పార్లమెంటు చరిత్ర తిరగేస్తే తాత్కాలిక బడ్జెట్లు చాలానే ప్రవేశపెట్టారు. కాని వార్షిక బడ్జెట్‌ను తలపించే విధంగా ఇన్ని వరాల జల్లులను కురిపించిన దాఖలాలు లేవు. ఎన్నికలముందు ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్లలో సామాన్యుల మీద ఎటువంటి బరువు భారాలు పడకుండా, లేదా వోటర్లను ఆకర్షించడానికి కొన్ని తాయిలాలు పంచిపెట్టడం చూచాం కాని ఇలా తాత్కాలిక బడ్జెట్‌నే ఇంత పెద్ద ఎత్తున ప్రసాదాల పంపిణీకి వేదికగా మార్చటం పార్లమెంటు ఇంటావంటా లేదు. జస్వంత్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో మరో విశేషమేమంటే, కేవలం వరాలు వర్షింపచేయడానికే తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టడం. అలా చేయటం కోసం ప్రతి సంవత్సరం మొదటి పార్లమెంటు సమావేశాన్ని రాష్ట్రపతి ఉపన్యాసంతో ప్రారంభించాలనే పార్లమెంటరీ నిబంధనావళిని కూడా తోసిరాజంది.

ఇలా ఇన్ని అడ్డదారులు తొక్కడానికి, అడ్డమైన గడ్డీ కరవాల్సిన అవసరమేమొచ్చింది? ప్రభుత్వం వాజ్‌పేయ్ పాలనలో అఖండమైన విజయాలను సాధించిందని కోట్ల రూపాయల ఖర్చుతో దేశంలో అన్ని పత్రికల్లోనూ పేజీలకు పేజీలు ప్రకటనలిచ్చారుగా? ముఖ్యంగా పేదప్రజలకు మేలుచేసే పథకాలను అమలుపరిచామని చెబుతున్నారుగా? విదేశీ మారకం నిల్వలు 104 బిలియన్ డాలర్లున్నాయని, ద్రవ్యోల్బణం అదుపులో వుందని, ఎగుమతులు పెరిగాయన్ని, జిడిపి 8.4 శాతం చేరుతోందని షేర్‌మార్కెట్ సెన్సెక్స్ చుక్కలు చూస్తుందని, ఇవన్నీ ఫీల్‌గుడ్‌ని సూచిస్తుందని పాలకులే చెబుతున్నారు. అభివృద్ధి అంగుళం మందాన సాగిపోతుందని అంటున్నారు. ఇలా అభివృద్ధి సాధించివుంటే ఇలా కాళ్లు విరగ్గొట్టుకునేలా పరుగులు తీస్తూ, ఒక విడత తర్వాత మరో విడత, ఓ మినీ బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసాదాలు పంచిపెట్టాల్సిన అవసరమేమొచ్చింది? ప్రచారం చేసినంత అభివృద్ధి జరగలేదని, జరిగినా అది సామాన్యులకు అందలేదని అందుకనే హడావుడిగా, మొక్కులు మెక్కుతున్నారని, ప్రచారం అంతా వట్టి భ్రాంతి, భ్రమేనని తేలిపోతుంది. ఇక వరాలలోకి పోయి చూస్తే...

ఉద్యోగుల జీతభత్యాలు

కొట్టొచ్చినట్టు కనపడేది కేంద్ర ప్రభుత్వోద్యోగులకిచ్చే కరువు భత్యంలో 50 శాతం జీతంలో కలిపివేయటం, 40 లక్షలపైగా వున్న కేంద్ర ప్రభుత్వోద్యోగుల వోట్లకు వేసిన వల అని వేరే చెప్పాల్సిన పనిలేదు. దీనిని సమర్థించుకోవడానికి ఇది అయిదవ పే కమిషన్ చేసిన సూచనే అమలు చేస్తున్నాం అంటున్నారు. మొన్నటి వరకూ ఈ పే కమిషన్ సిఫార్సులను అమలుపరచి, మొత్తం ఆర్థిక విధానాన్నే తలకిందులు చేశారని అప్పటి ప్రభుత్వాన్ని ఎడాపెడా ఇప్పటికే విమర్శించారు. ఆ చర్య రాష్ట్రాల బడ్జెట్లను కూడా ఒడిదుడుకులలోను చేసిందని తిట్టిపోశారు. అపుడే రాష్ట్ర ప్రభుత్వాలన్నీ మీరు మీ ఉద్యోగుల జీతభత్యాలను సవరించేటపుడు మమ్మల్ని సంప్రదించాలని కేంద్రాన్ని డిమాండు చేశారు. అలా విమర్శించిన పార్టీలే అధికారంలోకి వచ్చి ఆ కమిషన్ సిఫార్సునే అమలుపరచడమేమిటి? ఇది పచ్చి అవకాశవాదం కాకమరేమిటి? ఇలా సగం డి.ఎ.ను అసలు జీతంలో

కలపడం వల్ల కేంద్రం మీద అదనపు భారం రు.3500 కోట్లని 'హిందూ' పత్రిక అంచనా. ఇది రాష్ట్ర ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టడమే. అలా కలపకపోతే, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు చేతులు ముడుచుకొని కూర్చోరు. అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన పెద్దమనుషులు ఇపుడు గప్‌చుప్ అయిపోయారేమిటి?

వైద్యం

ఢిల్లీలో వున్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఎంఎస్) స్థాయిలో మరో ఆరు నగరాల్లో మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేస్తారట. సంతోషం. కాని వైద్యాన్ని ప్రైవేటీకరించే బాటలో పయనిస్తున్న ప్రభుత్వాలు రాష్ట్ర కేంద్రాల్లో భారీ అయిదు నక్షత్రాల ఆసుపత్రులకు అనుమతిస్తున్నాయి. ఇపుడింత అర్జంటుగా, అందులోనూ వోట్-ఆన్-అకౌంట్ బడ్జెట్లో ఈ విషయం ప్రకటించాల్సిన అవసరమేమొచ్చింది? అత్యవసరంగా వివిధ రాష్ట్రాల్లో కావాల్సింది గ్రామీణులకు సేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. ఈ రాష్ట్రంలో అలాంటి కేంద్రాల సంఖ్య కొన్ని సంవత్సరాలుగా స్థంభించిపోయింది. ప్రపంచబ్యాంకు రుణసహాయంతో జిల్లా, ఏరియా కేంద్ర వైద్యశాలలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వానికి ప్రాధాన్యతలు ఏవో తెలియకపోతే ఎలా?

సస్యవిప్లవం

రెండవ సస్యవిప్లవం వచ్చేస్తుందట. ఎలా? అంత్యోదయ అన్న పథకాన్ని మరో ఒకటిన్నర లేదా రెండు కోట్లమంది జనాభాకు విస్తరించటం, (ఇది పేదలకు సహాయం చేయవచ్చుగానీ, సస్యవిప్లవమెలా అవుతుంది?) సహకార బ్యాంకులకు 15 వేలకోట్లు కేటాయించి వాళ్ల బాలన్స్ షీట్ల ఆరోగ్యాన్ని బాగు చేయమంటున్నారు. చెరకు రైతులకు మిల్లు యజమానులు రెండువేల కోట్లు బకాయిపడితే వాటిని చెల్లించాలని ఆందోళన చేస్తున్న రైతుల గురించి పల్లెత్తు మాటలేదు. వ్యవసాయంలో తగ్గిపోతున్న పెట్టుబడులను ఎలా పునరుద్ధరించాలి అనే విషయమే ప్రస్తావన లేదు. రైతులు బాంకులకు చెల్లించే రునాల మీద పన్ను తగ్గిస్తారని "నమ్మకాన్ని" వెలిబుచ్చారు. ప్రతీ రైతుకు ఎంత రుణం కావాలో అంచనా వేయమని "సలహా" ఇచ్చారు. వ్యవసాయ రుణాల అవసరం గురించి ఓ కమిటీని నియమిస్తారట. ఉన్న కిసాన్ క్రెడిట్ కార్డులను అందరికీ అందేలా చూడాలట (కేవలం 2.70 కోట్లమందికి కిసాన్ క్రెడిట్ కార్డులిచ్చామని, మిగతా వారందరికి 2004 ఆఖరుకు పూర్తిచేస్తామని అయిదు సంవత్సరాల ఎన్.డి.ఎ. ప్రభుత్వం అనే కేంద్ర ప్రభుత్వ ప్రచురణలో చెప్పారు. దేశంలో 14 కోట్ల రైతు కుటుంబాలున్నాయనుకొంటే ఇపుడు వచ్చే మార్చి నెలలోపునే అందరికీ కార్డుల జారీ పూర్తిచేస్తామంటే నమ్మాలా?) వ్యవసాయాదాయం, ఇన్సూరెన్స్ పథకం, స్వయం సహాయ పథకాలను కొనసాగించటం లేదా విస్తరించటం, పశుగణాభివృద్ధి బోర్డునేర్పాటు చేయాలనే "ప్రతిపాదన" చేశారు. ఇవండీ రెండవ సస్యవిప్లవం రూపురేఖలు. ఇందులో వ్యవసాయాభివృద్ధికి నేరుగా పనికి వచ్చేదొక్కటైనా వుందా? ఏ వ్యవసాయం అయితే మొత్తం దేశం ఆర్థిక విధానాన్నే సంక్షోభం నుంచి బయటపడేసి పరిశ్రమలను పుంజుకునేలా చేసిందో ఆ వ్యవసాయాన్ని అలా ఎడమచేత్తో చచ్చిపోయిన ఎలకను విసిరేసినట్లు, పక్కకు తోసేయడమంత విశ్వాసఘాతుకమైన బడ్జెట్ మరొకటి వుండబోదు!

"ఆలోచిస్తాం"

ప్రభుత్వోద్యోగులకు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేని పరిమితిని పెంచటం గురించి ఆలోచిస్తామని చెప్పటం జరిగింది. 50 శాతం డి.ఎ.ను జీతంలో కలిపి, పై విషయం గురించి ఆలోచిస్తున్నామని అనటంలో అర్థమేమిటంటే "మీరు మా కాషాయ పార్టీకి వోటు వేసి గెలిపించండి, అపుడు మీ రెండో కోర్కె తీరుస్తాం" అని వారి వోట్లకు గాలం వేయడమే. నీతులు చెప్పే పార్టీ ఎంత పతనావస్థకు దిగజారింది!

నిరుద్యోగం

దేశం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేధిస్తున్న సమస్య నిరుద్యోగ సమస్య. ఇన్ని కోట్లమంది నిరుద్యోగులు ఉపాధి కోసం ఏడుస్తుంటే, 'అంతా బావుందనే' సంగీతం ఎలా పాడుతున్నారు? ప్రజల బాగోగులు చూడటం తన ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం స్వీకరించిందని జస్వంత్ తన ఉపన్యాసం ప్రారంభంలోనే చెప్పుకొన్నారు. నిరుద్యోగులను సృష్టించడం అనే బాధ్యతను కూడా ప్రభుత్వం స్వీకరించిందా ఏమిటి? ఆకలిబాధలు, ఆత్మహత్యలు, పేదరికం ఇవన్నీ దినదిన ప్రవర్ధమానమవుతున్నాయంటే, ఇవి కూడా స్వీకరించిన బాధ్యతల్లో వున్నాయా?

ఎడమచేత్తో, కుడిచేత్తో నిధుల ఏర్పాటును ప్రకటించారు. వ్యవసాయ మౌలిక సౌకర్యాల రుణనిధి, చిన్న మధ్య తరహా సంస్థలనిధి,

పారిశ్రామిక మౌలిక సౌకర్యాల నిధి, రక్షణ ఆధునీకరణ నిధి వాటిలో వున్నాయి. ఇవన్నీ "త్వరలో" ప్రారంభం చేస్తారట. వీటన్నిటికి నిధులెక్కడి నుంచి తెస్తారని ప్రధాని ఆర్థిక సలహాదారు ఎస్.నారాయణ్ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ మౌలిక సౌకర్యాల అభివృద్ధి నిధి ఒకటి పనిచేస్తుంది. మార్చి 2003 నాటి లెక్కల ప్రకారం తొమ్మిది విడతలుగా రు.29,475 కోట్లు మంజూరు చేయగా రాష్ట్రాలు వినియోగించుకున్నది. రు. 17,145 కోట్లు మాత్రమే (58.2 శాతం) ఏ సంవత్సరానికా సంవత్సరం మంజూరైన నిధులు ఖర్చు చూస్తే, మొదటి విడత రుణంలో 92 శాతం వినియోగించుకోగా, తొమ్మిదో విడతలో 18.5 శాతం మాత్రమే వినియోగించుకున్నాయి. అలాగే బ్యాంకులు ప్రాధాన్యత రంగాల్లో వ్యవసాయానికిగాను 18 శాతం ఇవ్వాల్సి వుండగా గత మూడు సంవత్సరాల్లో 15 శాతం వద్దనే తచ్చాడుతోంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇది వరకే ప్రారంభించిన నిధుల పనితీరు ఇలా తగలడుతోంటే, వాటి విషయం పట్టించుకోకుండా, మళ్లీ కొత్త నిధులు ప్రారంభిస్తున్నామంటే రైతాంగానికి ఏదో చేసేస్తున్నాం అనే భావన కలిగించి వోట్లు దండుకోవడమే జస్వంత్ లక్ష్యంగా కనపడుతోంది. అలాగే రక్షణ ఆధునీకరణ నిధి కూడా. చేసిన కేటాయింపులే ఖర్చు కాక ఈ శాఖలను నిధులను ఖజానాలో తిరిగి జమవేస్తుంటే, మళ్లీ మరోనిధి ఏమిటి?

ఆదాయ వ్యయాలు

రెవెన్యూ ఆదాయం పెరిగింది, ఖర్చు తగ్గింది కాబట్టి దేశం వెలిగిపోతోందని జస్వంత్ అంటున్నారు. కాని ఇలా పెరగటం, తరగటం ఉన్న ఆర్థిక వనరులను సవ్యంగా మేనేజ్ చేయటం వల్ల సాధ్యమైవుంటే ఆయనకో మెడల్ ఇవ్వవచ్చు. గ్యాస్, కిరోసిన్‌లకు ఇచ్చే సబ్సిడీ తగ్గించటం ద్వారా రెవెన్యూ ఆదాయం పెరుగుతుంది. ఈ సబ్సిడీలను చమురు శుద్ధికర్మాగారాల మీదకు నెట్టారు. సబ్సిడీ తగ్గిస్తే మనం చెల్లించాల్సిన ధరలు పెరుగుతాయి. అబ్బే, ఇపుడు పెంచటం లేదని భరోసా ఇస్తున్నారు. ఇపుడెందుకు చేస్తారు. మనం పొరపాటున ఎన్.డి.ఎ. ప్రభుత్వాన్నే తిరిగి అధికారంలోకి పంపిస్తే, ఆభారం మళ్లా మన నెత్తిమీద వేస్తారు. ఇవాళ సాధ్యం కాలేదు గాని ఆయిల్ కంపెనీల ప్రైవేటీకరణ వేటుపడనుంది. అపుడు వాళ్లు నయాపైసా సబ్సిడీ ఇవ్వరు సరికదా, లాభాలు గుంజుకొనే విధంగా ధరలు పెంచుతారు. అలాగే ఆరుకోట్ల టన్నులకు పెరిగిన ఆహారధాన్యాల నిల్వలను ఆయన నష్టానికి ఎగుమతి చేశారు, లేదా చంద్రబాబుకు ఉచితంగా 40 లక్షల టన్నుల తిండిగింజలు సరఫరా చేశారు. నిల్వలు తగ్గటం వల్ల ఆ ఖర్చు తగ్గింది. వడ్డీరేట్లను తగ్గించి పరిశ్రమలకేదో వొరగబోస్తున్నామని చెబుతారుగాని, తగ్గటం వల్ల ప్రభుత్వం బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలమీద తక్కువవడ్డీ చెల్లిస్తుంది. ఇలా అనేకవిధాలుగా ఖర్చు తగ్గింది, ఆదాయం పెంచుకొంది కాని పొదుపు చేయటం వల్ల, చక్కగా మేనేజ్ చేయటం వల్ల కాదు. సహజంగానే ద్రవ్యలోటు తగ్గుతుంది.

క్షీణిస్తున్న పెట్టుబడులు

పిండికొద్దీ రొట్టె అన్నారు. అసలు పిండే లేకపోతే రొట్టె ఎలా వస్తుంది. నారాయణ్ ఇదే అంటున్నారు. గత పది సంవత్సరాల్లో ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు ప్రభుత్వమే పెట్టాల్సిన బాధ్యతను పక్కకు నెట్టేసింది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గిపోతున్నాయని కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వమే చెబుతుంది. పెట్టుబడి పద్దు కింద ఖర్చు 03-04లో రు.111368 కోట్ల 04-05లో రు.76692 కోట్లకు అంటే రు.34676 కోట్లు మేరకు తగ్గనుంది. పెట్టుబడి పద్దుకింద ఆదాయం కూడా అదే కాలంలో రు.211228 కోట్ల నుంచి రు.166552 కోట్లకు తగ్గనుంది. ఆదాయమూ, ఖర్చూ రెండూ తగ్గుతూంటే, దేశం వెలిగిపోతుందంటున్నారు పాలకులు. వారి దృష్టిలో వెలుగు అంటే వేరే అర్థం ఏదో వుండివుండాలి.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా వెలుగు స్ట్రోక్ తగిలింది. ఆయన కళ్లజోడు పెట్టుకోవాల్సిన రోజులు దగ్గరపడుతున్నట్టుంది. ఎందుచేతనంటే కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదలాయింపు అయ్యే నిధులు (చిన్నమొత్తాల పొదుపు నిధులతో సహా) 02-03లో రు.1,50,561 కోట్ల నుంచి రు.1,43,284 కోట్లకు అంటే జిడిపిలో భాగంగా 6.2 శాతం నుంచి (02-03), 5.2 శాతానికి (03-04) తగ్గిపోయింది. అలాగే ప్రణాళికేతర గ్రాంట్లు 03-04లో బడ్జెట్ అంచనా రు.18,369 కోట్ల నుంచి సవరించిన అంచనా ప్రకారం రు.15669 కోట్లకు తగ్గాయి. మొత్తం రు.4,800 కోట్లు తగ్గాయి. అంటే కేంద్రానికి వెలుగు, రాష్ట్రాలకు చీకటి.

భారతదేశం వెలిగిపోతుందా? తళతళ మెరిసిపోతుందా? వాజ్‌పేయ్‌కు వోట్లహారం వేద్దామా?

పర్యావరణం - 2

విశాఖ పట్నమా.. రిస్కీ పట్నమా?

ఓ ప్రక్క పచ్చటి కొండలు.. మరోప్రక్క ఉవ్వెత్తున ఎగిసిపడే అలల అందాలతో ఎంతో ఆరోగ్యకరమైన వాతావరణంలో ఆహ్లాదంగా ఉండేదని భావించబడిన విశాఖపట్నం. గత యాభై సంవత్సరాలనుంచి పారిశ్రామిక నగరంగా మారుతూ వచ్చింది. ఈ పారిశ్రామికీకరణ, నగరానికి సంపదతోపాటు కొన్ని సమస్యల్ని కూడా తీసుకువచ్చింది. వాటిలో మెదటిది వాతావరణ కాలుష్యం రెండవది, అతి పెద్ద ప్రమాదాలకు దారితీయగల విషపూరితమైన, ప్రేలుడు స్వభావం కలిగిన పదార్థాలు నిల్వ చేయబడి ఉండటం. ఇటువంటి ప్రమాదకరమైన వాతావరణం నెలకొని ఉన్న నేపథ్యంలో విశాఖపట్నం పేరును 'రిస్కీపట్నం' గా మార్చడం సబబుగా ఉంటుందనిపిస్తుంది.

నగరంలోని వాతవరణ కాలుష్యం: విషపదార్థాలు కాలుష్య రూపంలో పట్టణ వాతావరణంలో పొంచివుండంతో జనాభాలో సగం మంది ప్రజలు, కాన్సర్, బారినపడే ప్రమాదం ఉందని చెప్పవచ్చు. 1997 సం॥లో ఆంధ్ర యూనివర్సిటీ వారిచే నిర్వహించబడిన ఒక ఆధ్యయనం క్రింది ప్రాంతాల్లో గాలి కాలుష్యపూరితమైవుందని తెలిపింది.

1. పోర్టు ఏరియా (ఇ.ఎస్.ఐ హస్పటల్, సింధియా జంక్షన్, ఫెర్టిలైజర్ బెర్త్ ఇన్నర్ హర్బర్, ఎస్సార్ ఇండస్ట్రీ మొదలైన ప్రాంతాలు)
2. విసినిటి ఏరియా (కాకానినగర్, షీలానగర్, జ్ఞానపురం, ఆంధ్రపురం, ఆంధ్రమెడికల్ కాలేజి మెన్స్ హాస్టల్, గోల్డెన్ జూబిలీ హాస్పటల్ మొదలైనవి)

ఇవేగాక ఏరియాలలోనేగాక కంట్రోల్డ్ ఏరియాగా చెప్పబడుతున్న ప్రశాంతి నగర్, యారాడ, ముడసర్లోవ, ఆఖరికి మధురవాడ, పోతిన మల్లయ్యపాలెం, వరవాడ, పెదగంట్యాడ మొదలైన ప్రాంతాల్లో కూడా వాతవరణం కాలుష్యపూరితమైంది

ఈ కాలుష్యాల్లో ముఖ్యమైనది కాపర్, లెడ్, ఐరన్, మాంగనీస్, కాడ్మియం, నికెల్, కోబాల్ట్, జింక్‌లే కాకుండా పాలీ ఆరోమాటిక్ ప్రమాదకరమైన రసాయనాలు ప్రేలుడు పదార్థాలు నగరపౌరుల్ని మరింత రిస్కులోకి నెడుతున్నాయి.

ఇండస్ట్రియల్ ఏరియాలో మొత్తం ఇరవై వేల టన్నుల అత్యంత ప్రమాదకరమైన అమ్మెనియా వాయువు వివిధ టాంకుల్లో నిల్వ చేయబడి వుంది. అంతేకాకుండా హెచ్‌పీసీయల్, ఈస్టిండియా పెట్రోలియం లిమిటెడ్ కంపెనీల్లో మొత్తం ఇరవై మూడువేల టన్నుల, అత్యంత మండే స్వభావం కలిగిన ఎల్.పి.జి స్టోర్ చేయబడివుంది. దీనికి తోడు మండే స్వభావం కలిగిన క్రూడ్ అయిల్ కూడా ఇండస్ట్రీల్ ఏరియాలో అనేక వేల టన్నుల నిల్వచేయబడివుంది.

ఈ నేపథ్యంలో దాదాపు 60 మంది ప్రాణాలను బలిగొన్న సెప్టెంబర్ 1997 నాటి హెచ్‌పిసియల్ అగ్నిప్రమాదం మీకు గుర్తుండే ఉంటుంది. ఒకవేళ ఆ ప్రమాదం ఆదివారం ఉదయం 6.30కి కాకుండా సోమవారం ఉదయం 9.30 కి జరిగి వుంటే ఏమైవుండేది? ఇప్పుడు జరిగినదానికన్నా దాదాపు పదిరెట్లు ప్రాణనష్టం జరిగివుండేది. ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయో ఎవ్వరూ చెప్పలేరు. ప్రపంచంలో అత్యంత ఉన్నతస్థాయి జాగ్రత్తలు తీసుకోబడిన 'కొలంబియా' స్పేస్‌షటిల్ కూడా ప్రమాదం పాలవడం మనకు తెలుసు.

ఇలాగే ఒకవేళ అమ్మెనియా గ్యాస్ టాంక్ పేలితే - ? దాని ప్రభావం ఐదు కిలోమీటర్లు నుండి 20 కి.మీ వరకూ ఉంటుంది. పదివేల టన్నుల కెపాసిటీగల కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారి రెండు టాంకులు పేలితే రెండున్నర కిలోమీటర్ల వరకూ మొత్తం జీవరాశి సమూలంగా నాశనమైపోతుంది. 20వేల టన్నుల గోదావరి ఫెర్టిలైజర్స్ వారి అమ్మోనియం టాంకు పేలితే దాదాపు మూడు కిలోమీటర్ల వరకూ నామరూపాల్లేకుండా పోతుంది. ఒకవేళ ఎల్.పీ.జీ గ్యాస్ టాంక్ పేలితే? ఒక్క గ్యాస్‌టాంకు పేలితే ఆ వత్తిడి వెంటనే మిగతా టాంకులను కూడా పేలిపోయేటట్లు చేస్తుంది. ఆ భయంకరమైన విస్ఫోటనంలో శకలాలు దాదాపు మూడున్నర కిలోమీటర్ల వరకూ వెదజల్లబడవచ్చు. ఒక కిలోమీటర్ రేడియస్‌లో జీవరాశి మొత్తం బూడిదగా మారిపోతుంది. ఇటువంటి భయంకరమైన ప్రమాదం ఏదీ జరక్కముందే విశాఖ ప్రజలు మేల్కోవలసి ఉంది.

ఇందుకోసం ప్రస్తుతం అత్యవసరంగా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు.

1. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో క్రొత్త పరిశ్రమల స్థాపనకు అనుమతి నివ్వడం నిలిపివేయాలి.
2. 1997లో జరిగిన హెచ్‌పీసియల్ ప్రమాదం తాలుకు విచారణ

*(తరువాయి **22**వ పేజీలో)*

అధికారమే అవకాశవాద రాజకీయాల అసలు లక్ష్యం

- తెలకపల్లి రవి

ముందస్తు ఎన్నికల ముంగిట్లో చంద్రబాబు నాయుడు ముందుకు తెస్తున్న వాదనలు, లేవనెత్తుతున్న నినాదాలు కుటిల రాజకీయ వ్యూహాలకు ప్రతిబింబంగా వున్నాయి. అసలు ముందస్తు వుంటుందా లేదా అనే అంశంపైనే రకరకాలుగా మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టించిన ముఖ్యమంత్రి తను జపించే పారదర్శకతను తనే పాతిపెట్టారు. కేంద్రంలోని బిజెపి నేతలతో తప్ప ఆఖరుకు తన పార్టీ ముఖ్యులతో కూడా ఆయన మనసు పంచుకోలేదు. ప్రజల తీర్పే అంతిమం అనేవారు తీర్పునివ్వాల్సిన ఆ ప్రజలకు వాస్తవాలు చెప్పాలనే కనీస సూత్రాన్ని కూడా పాటించకుండా దాగుడుమూతలాడారు. ఇలా నాన్చి నాన్చి చివరకు ఆయన శాసనసభ రద్దు తేదీ ప్రకటించిన సమయం అనేక కొత్త సమస్యలకు దారితీసింది. తాత్కాలిక బడ్జెట్ ఆమోదంలాంటి సాంకేతిక సమస్యల నుంచి పిల్లల పరీక్షల వంటి వాస్తవ సమస్యల వరకూ తలెత్తాయి. ఇంతలో కేంద్రంలో కూడా ఎన్నికలను ముందుకు జరపాలనే ఆలోచన రావడంతో రాష్ట్ర ఎన్నికల తేదీ నిర్ణయం ఇంకా ఇరకాటంగా తయారైంది. సకల సమాచారం లాప్‌టాప్‌లో నిక్షిప్తం చేసుకుని, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ముందు కూడా కంప్యూటర్ కౌశలం ప్రదర్శించే ముఖ్యమంత్రికి ఈ ప్రాథమిక వాస్తవాలు పరిగణనలో లేకపోతే అది ఆయన సమర్థతపై వ్యాఖ్యానం. లేదు తెలిసే అలా చేశారంటే అది చిత్తశుద్ధి రాహిత్యానికి దర్పణం. అనుభవాన్ని బట్టి ఈ రెండోదే ఎక్కువని అనుకోవాలి.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొదట్లో నిలదొక్కుకోవడానికి అవసరమైన కాలాన్ని మినహాయించితే చంద్రబాబు నాయుడు రాజకీయాలన్ని సూత్రరహితంగానూ, అవకాశవాద పద్ధతుల్లోనూ నడుస్తున్నాయని కనీసంగా పరిశీలించినా అర్థమయ్యే విషయం.

తొలి మాటలు తలకిందులు

ఎన్టీఆర్ ప్రజాస్వామిక పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటే తిరుగుబాటు చేసి పదవి చేపట్టిన చంద్రబాబు మొదట్లో వామపక్షాల మద్దతుపై ఆధారపడ్డారు. అందుకోసం తాత్కాలికంగా భూపంపిణీ, మద్యనిషేధం పటిష్టపరచడం వంటి చర్యలు తీసుకున్నారు. 1996 ఎన్నికల ప్రచారంలో తనను గెలిపిస్తే చౌకబియ్యం వుంటాయని రెండేళ్ళు చూపించారు. ఇదంతా ఎన్నికలు ముగిసే వరకే. ఆ ఘట్టం పూర్తవగానే శ్వేతపత్రాలు ప్రకటించడం మొదలెట్టారు. వరుసగా ఒక్కో రంగాన్ని ప్రైవేటువారికి అప్పగించుతూ ఉద్యోగులు కార్మికులను వీధులపాలు చేశారు. చౌకబియ్యం ధర పెంచేశారు. మద్యనిషేధం నీరుగార్చారు. ఇవన్నీ చేయడం ఒక ఎత్తు. కానీ అంతకుముందు చేసిన వాగ్దానాలకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తించడంలో ఆయన నిజాయితీరాహిత్యం బట్టబయలైంది.

యునైటెడ్ ఫ్రంట్ అధ్యాయం

1996 ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడిన వాజ్‌పేయి ప్రభుత్వం 13 రోజులలో కూలిపోయింది. అంతకుముందు నుంచి చంద్రబాబు వామపక్షాలతో, జనతాదళ్‌లతో కలసి వ్యవహరిస్తూ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటులో ఒక కీలకపాత్ర వహించారు. హరికిషన్‌సింగ్ సూర్జిత్ వంటివారు దానికి మూలస్తంభాలైన్పటికి చంద్రబాబు యువకుడు, సమర్థుడనే ఉద్దేశంతో ఆయనను దానికి కన్వీనర్‌ను చేశారు. ఆయన అన్ని విధాల సహాయసహకారాలు అందించారు. ఈ విషయాలన్ని తెలిసి కూడా చంద్రబాబు వంధిమాగధులు ఆయనే అన్ని చేస్తున్నట్టు చక్రధారి చంద్రబాబు అంటూ భజనలు చేశారు.

యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో తెలుగుదేశం మంత్రులు కూడా వున్నారు. దాన్ని బయటనుంచి బలపరిచింది ప్రధానంగా కాంగ్రెస్, సిపిఎంలు. అయినా ఆ ప్రభుత్వంలో చేరడానికి తెలుగుదేశంకు ఏ అభ్యంతరం లేకపోయింది. దేవగౌడ ప్రభుత్వాన్ని అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం కేసరి పడగొట్టిన తర్వాత దశలో ఆ పార్టీ నాయకత్వాన్ని ఎలాగో మంచి చేసుకుని ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో చంద్రబాబు అతిగా ఆరాటపడ్డారు. కొంతకాలం తర్వాత గుజ్రాల్ ప్రభుత్వం వుండగానే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి అభ్యర్థులను ప్రకటించారు. ఈ విధంగా దేశంలో మూడు ప్రధాన పదవులకు ఆంధ్రభవన్ నుంచే అభ్యర్థులను ప్రకటించడం గర్వకారణమని చంద్రబాబు చెప్పుకున్నారు. ఇదంతా తన వ్యక్తిగతమైన ఘనతేమీ కాదని, మిగిలిన వామపక్ష లౌకిక శక్తులు కలిగించిన గౌరవమని మరిచిపోయారు.

అవకాశవాదానికి పరాకాష్ట

గుజ్రాల్ ప్రభుత్వం కూడా పడిపోయిన తర్వాత 1998 ఎన్నికలు వచ్చాయి. ఈసారి కూడా చంద్రబాబు వామపక్ష, లౌకిక శక్తులతో కలిసే పోటీ చేశారు. ఎన్నికలు ముగిసే వరకూ దాని తరఫునే

మాట్లాడారు. దేశవ్యాపితంగా ఫలితాలు దానికి అనుకూలంగా రాకపోవడంతో అమాంతం ప్లేటు మార్చారు. తను కన్వీనర్‌గా వున్న యునైటెడ్ ఫ్రంట్‌ను క్షణాల మీద వదిలేశారు. రాజకీయంగా అందుకు ఎలాటి సహేతుక వివరణా ఇవ్వాల్సిన బాధ్యత వుందనుకోలేదు. ఇతర భాగస్వామ్యపక్షాల మీద ఆకుకు అందని పోకకు పొందని ఆరోపణలు చేస్తూ కాషాయ జట్టులో చేరికకు సంకేతాలు వదలసాగారు. అదైనా సూటిగా కాదు. లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు కొన్ని క్షణాల ముందు బాలయోగిని హుటాహుటిన తరలించారు. ఆ విధంగా వాజ్‌పేయి ప్రభుత్వానికి ఆప్తమిత్రుడైనాడు. మరో వైపున ప్రభుత్వంలో చేరలేదంటూ ఆత్మవంచన, పరవంచన చేసుకున్నారు. ప్రభుత్వ నిర్వహణలో అత్యంత కీలకమైన సభాపతి స్థానాన్ని ఇవ్వడమే బిజెపితో ఆయన బ్రహ్మముడికి సాక్ష్యమైంది. అటు మొగ్గడమే కాకుండా కరుణానిధి, తదితరులతో మంతనాలు జరిపి బిజెపి వైపు చేరడానికి దోహదపడ్డారు. ఆ విధంగా చంద్రబాబు దేశ రాజకీయాలు మితవాదమలుపు తీసుకోవడంలో, స్థిరపడ్డంలో ముఖ్యపాత్ర వహించిన చంద్రబాబు రాజకీయ దోషం చెరిగిపోయేది కాదు.

ఎన్‌డిఎలో భాగస్వామిని కానని, లౌకిక విధానాల విషయంలో రాజీపడేది లేదని పదేపదే ప్రకటించిన చంద్రబాబు తొలిదశలో కొంత విడగొట్టుకున్నా క్రమేణా ఆ తానులో ముక్కలా మారారు. మాట్లాడితే కాంగ్రెస్‌ను తిట్టడం, అధికారంలో వున్న బిజెపి దుశ్చర్యలను కప్పిపుచ్చడం పనిగా పెట్టుకున్నారు. కాంగ్రెస్ తప్పుడు విధానాలను తప్పక ఖండించవచ్చు. (నిజానికి చంద్రబాబు కాంగ్రెస్ నుంచి వచ్చిన వ్యక్తి కాగా దానిపై మొదటినుంచి పోరాడుతున్నది కమ్యూనిస్టులు) కాని అంతకంటే అనేక విధాల ప్రమాదకరమైన బిజెపి మతోన్మాదాన్ని భుజానవేసుకోవటం చంద్రబాబుకే చెల్లింది. పైగా అంతకుముందు కాంగ్రెస్ మద్దతు గల ప్రభుత్వంలో తామూ భాగస్వాములుగా వున్నామన్న వాస్తవాన్ని కూడా ఆయన కావాలనే మరచిపోయారు. విద్యామంత్రుల సమావేశం నుంచి వాకౌట్ జరిపిన ఒక్క సందర్భాన్ని మినహాయించితే తెలుగు దేశం ఎప్పుడు బిజెపికి నమ్మకమైన నేస్తంగా వుండిపోయింది. జయలలిత, మమత బెనర్జీ, వంటివారు ఆఖరుకు సమతా పార్టీ కూడా లాంచనంగా నైనా అప్పుడప్పుడూ అసమ్మతులు, విడిపోవడాలు వంటివి చేశాయి. కాని ఎన్‌డిఎలో భాగస్వామిని కానంటూనే తెలుగుదేశం దాని తరుపున అత్యంత విశ్వసనీయంగా నిలబడింది. ఇదంతా 1998-99 మధ్య కథ.

తదుపరి ప్రహసనం

కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి వ్యక్తిత్వం చుట్టూ తిరుగుతున్న బిజెపి ప్రచారాన్ని తనను కూడా ఉపయోగించుకోవాలని తాపత్రయంతో చంద్రబాబు అసెంబ్లిని రద్దు చేసి కొంచెం ముందుగానే ఎన్నికలకు వెళ్ళారు. కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం నిలబడటానికి సహకరించడమే కాక మన రాష్ట్రంలో కూడా అది నిలదొక్కుకోవడానికి కారకులైనారు. హైదారాబాద్‌ను మినహాయిస్తే మిగిలిన చోట్ల వామపక్ష లౌకిక శక్తులనే బలమైన పునాదులు గల ఈ రాష్ట్రంలో హిందుత్వ శక్తుల చొరబాటుకు కారకులయ్యారు. దీని ఫలితం తర్వాత రాష్ట్రం చవి చూసింది. చర్చిలలో పేలుళ్ళు, మతకలహాలు చూసింది. అయినా చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్టుండిపోయారు. ఇది ఐఎస్ఐ పని అని ప్రకటించడానికి త్వరపడటం తప్ప మతసామరస్యం, లౌకిక తత్వం నొక్కి చెప్పాలని భావించలేదు. బంగారు లక్ష్మణ్, జార్జ్ ఫెర్నాండెజ్‌ల తెహల్కా కుంభకోణం వగైరాలు జరిగినా లాంఛనంగా తప్ప గట్టిగా నోరు మెదపలేదు. ఆఖరుకు గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీని మార్చాలని వాజ్‌పేయి అనుకుంటున్నట్లు వార్తలు రావడంతో చంద్రబాబు కూడా అదే డిమాండ్ చేశారు. తర్వాత బిజెపి నేతలు తమలో తాము సర్దుకుని మోడీనే కొనసాగిస్తే ఏం చేయాలో తోచక తెల్లమొహం వేశారు. సమర్థించుకోవడానికి నానాపాట్లు పడ్డారు. పార్లమెంట్ ఓటింగ్‌లో తమ వైఖరి చెబుతామని హడావుడి చేసి చివరకు తుస్సుమనిపించారు. ఇదంతా మతోన్మాదరాజకీయాలతో చంద్రబాబు కుమ్మక్కుకు తిరుగులేని నిదర్శనం. రామరథ యాత్ర జరుపుతున్న అద్వానీని నిలవరించడానికి ఆఖరు వరకూ ప్రయత్నించిన ఎన్టీఆర్ వైఖరికి పూర్తి భిన్నం. ఈ విధంగా లౌకిక విలువలకు తిలోదకాలివ్వడమే తన రాజకీయ చాతుర్యమని, మేనేజి మెంటు నైపుణ్యమని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదం. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల కన్నా కూడా చంద్రబాబే ఎక్కువ విశ్వసనీయంగా వున్నాడని బిజెపి నేతలు చెప్పడానికి కారణమిదే. దీనంతటికి ఆయన చెప్పే కారణం కాంగ్రెస్‌ను ఎదుర్కోవలసిన అవసరం. ఆ మాటకొస్తే సిపిఎం బలమైన రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షం. అంతమాత్రాన బిజెపికి అనుకూలంగా వ్యవహరించాల్సిన అవసరం రాలేదు. ఆ రెండు పార్టీలను ప్రతిఘటించి పోరాడటం లేదా ?

రాష్ట్రంలో అధోగతి

రాజకీయ విధానాలు అటుంచి రాష్ట్రంలో పాలనా విషయాలకు

వస్తే అవీ అత్యంత అధ్వానంగా అఘోరిస్తున్నాయి. తాను సిఎంను కానని సిఇవోను అని చెప్పుకోవడం ఆయనకు ఇష్టమైన పని. అయితే స్వంత కంపెనీ సిఇవోగా గాక ప్రపంచ బ్యాంకు ఏజెంటుగా పని చేసే సిఇవో గనకే రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఆర్థికంగా అన్ని రంగాలలో దివాళా ఎత్తించిన తీరు గత సంచికలో చూశాం. ఈ వాస్తవాన్ని ప్రజలు గ్రహించడానికి ఎంతో కాలం పట్టలేదు. సహజంగానే ఆ తర్వాత వామపక్షాలు, కొంతవరకు కాంగ్రెస్ కూడా ప్రజా ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టాయి. విద్యుదుద్యమంతో ఇది తారాస్థాయికి చేరింది. ప్రపంచాన్నే ఆకర్షించింది. సిఇవో చంద్రబాబు ఈ ఉద్యమాలపై అమానుష నిర్బంధంతో విరుచుకుపడ్డారు. రాజధాని నడిబోడ్డున ముగ్గురు యువకుల ప్రాణాలు తీయించారు. ఆయన రాజకీయ పరివర్తనలో ఇది మలి ఘట్టం. ప్రపంచ బ్యాంకు సంస్కరణలు అమలు జరిపిన దేశాల్లో ప్రజాస్వామ్యం దెబ్బతినడమనేది ప్రతిచోటా కనిపించే అనుభవం. అది మన రాష్ట్రంలోనూ పోలీసులకు స్వేచ్ఛనిచ్చి ఎన్నడూలేనంతగా ప్రదర్శకులపైకి పురికొల్పడం తత్ఫలితమే. నక్జలైట్లను, నేరస్తులను కూడా ఎన్నడూ లేనంత జోరుగా ఎన్‌కౌంటర్లలో చంపడమూ ఇందులో భాగమే.

రాజ్యం తాలుకు ప్రత్యక్ష ప్రభావం ఇలా వుంటే చంద్రబాబులో అసహనం కూడా అంతకంతకూ పెరిగిపోతూ వచ్చింది. మీడియా మిత్రుడుగా చలామణి అయిన వ్యక్తి మీమైండ్ సెట్ మారాలని హితభోధలు ప్రారంభించారు! ప్రజలు సమస్యలపై నిలదీయాలని ప్రభోధించిన ముఖ్యమంత్రి ప్రశ్నించినవారిపై చిందులు తొక్కుతూ పోలీసులను పురికొల్పారు. జ్యోతిబాసులా ఇరవయ్యేళ్ళు పాలిస్తానని పదేపదే చెప్పిన పెద్దమనిషి కమ్యూనిజానికి కాలం చెల్లిందనే పల్లవి ఎత్తుకున్నారు. తన ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజ్వరిల్లే నిరసనను భరించలేని ఉక్రోషం వీటిన్నిటిలో విదితం.

2003 మధ్యలోకి వచ్చేసరికి ముఖ్యమంత్రి శైలి ఆకస్మాత్తుగా మారిపోయింది. ప్రజా సంక్షేమ సబ్సిడీలు పనికి రావని అదే పనిగా చెప్పిన వ్యక్తి కోటి వరాల పల్లవి ఎత్తుకున్నారు. ప్రజావ్యతిరేక విధానాల యోచనను తాత్కలికంగా పక్కనపెట్టేస్తానని ప్రపంచ బ్యాంకు ప్రభువులను ఒప్పించారు. ఇంతలోనే అలిపిరి దాడి జరిగింది. ఇలాటి వ్యక్తిగత చర్యలు అసలు సమస్యను దారి తప్పించడం చరిత్రలో ప్రతి దేశంలోనూ చూశాం. ఇక్కడా అదే పునరావృతమైంది. తీవ్రవాద సమస్య చుట్టూ చర్చ చాలా కాలం పరిభ్రమించింది. శాంతి భద్రతలను కాపాడలేకపోవడం, ఆఖరుకు ముఖ్యమంత్రికే రక్షణ లేకపోవడం వాస్తవానికి ప్రభుత్వ ఆసమర్ధత. అయితే ఆత్మ విమర్శ అలవాటు లేని ముఖ్యమంత్రి అందుకు ప్రతిపక్షాలను ఆడిపోసుకోవడం మొదలుపెట్టారు. నక్జలైట్లతో ఒక దఫా అధికారికంగా చర్చలు జరిపిన అధినేత ఆ సూచన చేసినవారంతా వారితో చేతులు కలిపినట్టేనని చిత్రించడం మొదలుపెట్టారు. ముందుస్తు మనసులో వుంచుకొని రోజుకు ఆరడజన చొప్పున ఆఘమేఘాల మీద శంకుస్థాపనలు సాగించారు. మళ్ళీ మహానాడు ప్రహసనం జరిపించి అసెంబ్లీ రద్దు చేయించారు. తర్వాత ఎన్నికల తేదీల తర్జన భర్జన వేరే చర్చ.

తన ప్రభుత్వం అమోఘమైన అభివృద్ధి సాధించిందని చెప్పుకునే ముఖ్యమంత్రి ఎన్నికలు మాత్రం తీవ్రవాదం సమస్యపైకి మళ్ళించడానికి ప్రమత్నించారు. అది తనకే బెడిసి కొడుతుందని తెలిశాక బిజెపిని మించి సోనియా గాంధీ విదేశీయతపై రెచ్చగొట్టడానికి తంటాలు పడుతున్నారు. మొత్తం పైన ప్రజల అసలు సమస్యలకన్నా లేనిపోని వివాదాలవైపు మళ్ళించడమే ఆయన ఉద్దేశమనేది సృష్టం. ఈ క్రమంలో ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ మరెన్ని కృతిమ సమస్యలు తెస్తారో ఊహించుకోవలసిందే. ధరలు, నిరుద్యోగం, పేదరికం, కరువులు, ఆకలిచావులు, అవినీతి, అత్యాచారాలు, శాంతిభద్రతలు వగైరా సవాలక్ష సమస్యలను కప్పిపుచ్చి మోసపూరితమైన వ్యర్ధ వివాదాల చుట్టూ తిప్పడం ప్రజాస్వామ్య ప్రాధమిక సూత్రాలకే భంగకరం.

ఈనాడు మనదేశానికి ప్రపంచీకరణ విధానాలు, మతోన్మాదం జంట ప్రమాదాలుగావున్నాయి. ఈ రెండు విషయాల్లోనూ చంద్రబాబు అటే వున్నారు. ఆయన ప్రపంచీకరణ శక్తులైన బహుళ జాతికంపెనీలకు, ప్రపంచ బ్యాంకుకు విశ్వసనీయ సేవకుడు. మతోన్మాద బిజెపికి ఆప్తమిత్రుడు. స్వతహాగా చిత్తశుద్ధి లేని రాజకీయ సంస్కృతికి ప్రతినిధి. చంద్రబాబే కాదు, అవకాశవాద రాజకీయాలను అనుసరించే నాయకులెవరికైనా అనివార్యంగా ప్రాప్తించే దురవస్థ ఇది. ఇన్ని బూటకత్వాలు పెనవేసుకున్న ఆయన వంచనా శిల్పాన్ని వమ్ము చేయవలసిన బాధ్యత ప్రజాస్వామిక వాదులందరిపైనా వుంది.

○

ఉత్పత్తి సాధనాల నుండి, శ్రమ నుండి దూరం చేయబడుతున్న దళితులు

- సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్రంలో ఏ పాలకవర్గాన్ని కదిలించినా దళితజనోద్ధరణ గురించి అనర్గళంగా మాట్లాడని వారు లేరు. ఏకంగా దళితులనే ముఖ్యమంత్రులుగా చేస్తామంటారు. అప్పుడప్పుడు పూర్తి శాసనసభా కాలం పాటు కాకపోయినా ముఖ్యమంత్రులుగా, ఇతర శాఖల మంత్రులుగా కొందరికి పట్టంకట్టారు. అనేక సంక్షేమ పథకాలు ప్రకటించారు. ఆర్భాటంగా ప్రచారాలు చేశారు. అయినా దళితులు గతంలో ఎక్కడ ఉన్నారో ఇప్పటికి అక్కడే ఉన్నారు. ప్రభుత్వ విధానాల వలన మరింత దరిద్రులు అవుతున్నారు. దారిద్ర్య నిర్మూలనకు బదులు దరిద్రుల నిర్మూలనా క్రమం సాగుచున్నది. ఆకలి, ఆరోగ్యం, అవిద్య, ఆవాసం కొరతలతో నిత్యదరిద్రులుగా వున్నప్పటికి సమాజసేవలో (ధనిక వర్గాలసేవలో) నిరంతరం శ్రమిస్తూ, దళితులు బ్రతుకులు వెళ్ళదీస్తున్నారు. నిరంతర శ్రమజీవులైన వీరిని నేటి ప్రభుత్వాలు, పాలకులు తమకున్న కొద్దిపాటి ఉత్పత్తి సాధనాల నుండి, శ్రమనుండి దూరం చేసే విధానాలు అవలంబిస్తున్నారు. పాలకులు ప్రకటించిన సంక్షేమ పథకాలు కొన్ని కాగితాలకే పరిమిత కాగా, మరికొన్ని మధ్య దళారీల పాలవుతున్నాయి. వీరి పేరున వచ్చిన పథకాలు అనేకం భూస్వామ్యవర్గాల చేతుల్లోకి వెళ్తున్నట్లు అనేక సర్వేలు తెలుపుతున్నాయి. గ్రామానికి, నాగరిక సమాజ జీవనస్రవంతికి దూరంగా వీరి నివాసాలుంటున్నాయి. వీరి గురించిన కొన్ని కఠినవాస్తవాలు పరిశీలించడం నేడు అవసరం.

హరిజనులు (మహాత్మాగాంధీ పెట్టిన నామధేయం) గిరిజనులు (అటవి గిరిజన - మైదాన గిరిజన) దళితులుగా పిలువబడుతున్నారు. వీరిలో అనేక ఉపకులాలున్నా వీరంతా దళితులే. అన్ని సమాజాలలోను వీరు ప్రధానంగా భూమిపై ఆధారపడి వ్యవసాయ సంబంధంగా జీవనం సాగిస్తున్నారు. వ్యవయానికి కావల్సిన పనిముట్ల ఏర్పాటేకాక, వ్యవసాయ కార్మికులుగా, పాలేర్లుగా, చిన్న, సన్నకారు రైతులుగా యున్నారు. వ్యవసాయ ఉత్పత్తిలో ప్రతివారు స్త్రీ, పురుష, వివక్షత లేకుండా పాల్గొంటారు. వీరి పిల్లలు 5 సంవత్సరాల వయస్సు నుండే ప్రధాన శ్రమలో భాగస్వాములవుతున్నారు. ఇదే వీరి జీవన విధానం.

అణగారిపోతున్న దళితులను దారిద్ర్యం నుండి విముక్తి చేయదానికే మా ప్రభుత్వం కంకణ బద్ధురాలై ఉంది. దళితుల ఉన్నతికి ముందుడుగు, చేయూత, మలుపు, కోటివరాలు అమలు చేస్తున్నాం.

- నారా చంద్రబాబునాయుడు,
(రాష్ట్ర ముఖ్యమంత్రి)

స్వాతంత్ర్యానంతరం భూస్వామ్య విధానం రద్దు చేస్తున్నామని, వ్యవసాయం, భూమిపై ఆధారపడేవారికి స్వంతహక్కులు కల్పిస్తామని చెప్పిన పాలకులు 1973 జనవరి 1న భూసంస్కరణల చట్టం చేసి దానిని రెండు సంవత్సరాలు ఆలస్యంగా 1975 జనవరి 1 నుండి అమలు చేశారు. దున్నేవారికే భూమిపై హక్కు కల్పిస్తామన్నారు. అట్టహాసంగా ప్రకటించిన భూసంస్కరణల అమలు ఈ విధంగా ఉంది. (రాష్ట్రంలో ఒక సీలింగుగా కుటుంబానికి 10 ఎకరాలు రెండు పంటలు పండే భూమి నుండి 54 ఎకరాలు ఒక పంట పండే చల్కాభూముల వరకు నిర్ణయించారు. భూములను 17 తరగతులుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణ వలన భూస్వాముల నుండి భూములు చాలా తక్కువ లభ్యమైనాయి).

వాటి పంపిణీ ఈ విధంగా ఉంది (1-1-1975 నుండి 31-3-1999 నాటికి)

మొత్తం డిక్లరేషన్ల సంఖ్య - 444901 (25 ఎకరాల పైబడినవారు)

పరిష్కరించిన డిక్లరేషన్లు - 444856

పరిష్కారం కానివి - 45

మిగులు భూమి గుర్తింపు - 7,91,701 ఎకరాలు

స్వాధీనం చేసుకున్నవి - 6,40,123 ఎకరాలు

హరిజనులు (2,25,932 మంది) - 2,311,79 ఎకరాలు

గిరిజనులు (83,688) - 1,21,084 ఎకరాలు

ఇతరులు (2,30,724) - 2,30,055 ఎకరాలు

ఇతర శాఖలకు పంపిణి - 14,199 ఎకరాలు

కోర్టు కేసులలో ఉన్నవి - 1,4 7,631 ఎకరాలు

ఇప్పటికి దాదాపుగా 1.5 లక్షల ఎకరాలు పంపిణీ కావాల్సి ఉంది. ప్రభుత్వపరంగా దీనికి చేపట్టిన చర్యలు ఏమి లేవు. తెల్లకాగితాలపై జరిగిన అమ్మకాలు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పిచ్చినా దానికి అనుగుణంగా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయలేదు. భూస్వాముల నుండి మిగులు భూములు తీయలేదు.

కొన్ని రాష్ట్రాల భూసీలింగ్ చూడండి. (ఎకరాలు)

	ఒక పంట	రెండు పంటలు
అస్సాం	6.74	6.74
హర్యానా	7.25	10.90
కర్నాటక	4.05	10.12
తమిళనాడు	4.86	12.14
పశ్చిమబెంగాల్	5.00	5.00

ఈ సీలింగు వలన కొంత భూమైనా పేదలకు దక్కింది. కాని ఆంధ్ర రాష్ట్రంలో సీలింగు ద్వారా 3 లక్షలమంది దళితులకు తలా ఎకరంకు మించిరాలేదు. ఆ భూమి కూడా సేద్యానికి అంతగా ఉపయోగపడనిదే! రాష్ట్రంలో భూమి తగినంత ఉంది.

మొత్తం రాష్ట్రంలో భౌగోళిక విస్తీర్ణం	6.85 కోట్ల ఎకరాలు
సేద్యం భూమి	2.75 కోట్ల ఎకరాలు
సేద్య భూమి పడావు	1.25 కోట్ల ఎకరాలు

4 కోట్ల ఎకరాల సాగుకు అవకాశం ఉంది. ప్రాథమిక ఉత్పత్తి సాధనమైన భూమి నేటికి భూస్వాముల ఆధీనంలోనే ఉంది. భూమిపై ఆధారపడిన అత్యధికులు భూమి లేనివారుగానే ఉన్నారు.

1995-96 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో కమతాలు .

కమతంసైజు హెక్టార్లు	కమతాలు లక్షలలో	మొత్తం కమతాలలో శాతం	భూమివిస్తీర్ణం లక్షల హెక్టార్లు	మొత్తం భూమిలో శాతం	సగటు కమతం (హె॥)
0-1	63.00	59.42	29.04	20.20	0.46
1-2	22.62	21.33	32.29	22.47	1.43
2-4	13.95	13.16	37.36	25.99	2.68
4-10	5.63	5.31	32.31	22.48	5.74
10 పైన	0.83	0.78	12.73	8.86	15.31
మొత్తం	**106.03**	**100**	**143.73**	**100**	**1.36**

1990-91లో సగటు కమతం 1.56 హెక్టార్లుకాగా, 95-96లో 1.36 హెక్టార్లకు తగ్గింది. రెండు హెక్టార్లలోపు కల్గినవారు 85.62 లక్షల (80.75 శాతం) కాగా వీరివద్దనున్న భూమి 61.33 లక్షల హెక్టార్లు (44.67 శాతం) మాత్రమే. ఒక శాతానికి లోపుగా వున్న 10 హెక్టార్లుపైన వున్న వారి వద్ద దాదాపు 13 లక్షల హెక్టార్లుంది. ఇవి కాక బినామిగా కూడా లక్షల హెక్టార్లున్నాయి. ఈ పరిస్థితిని గమనించినప్పుడు దళితుల స్థితి ఏవిధంగా ఉంటుందో ఊహించనిదికాదు.

భూసంస్కరణలు అమలు జరిగిన తర్వాత దళితులు భూములు పొందలేదు. కూలీపని, వెట్టిచాకిరి, కులవివక్షత నగ్నంగా కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం వ్యవసాయ కార్మికులు 1991లో 116.25 లక్షలు కాగా 2001లో 137.19 లక్షలుగా పెరిగారు. ఇందులో దళితుల62.52 లక్షల సంఖ్య పెరిగింది. దాదాపుగా సగం వ్యవసాయ కార్మికులు దళితులే.

హరిజనులు :

1961 నుండి గణాంకాలు పరిశీలిస్తే హరిజనులు రెట్టింపుకుపైగా జనాభా పెరిగింది. అదే దామాషాలో వ్యవసాయ కార్మికులు పెరిగారు. 2001 సంబంధించిన గణాంక వివరాలు ఇంత వరకు ప్రకటించలేదు.

1991నాటికి హరిజనుల స్థితిగతులు ఈ విధంగా ఉన్నాయి. (లక్షలలో)

వివరం	1961	1971	1981	1991
హరిజన జనాభా	49.73	57.74	79.61	105.92
మొత్తం జనాభాలో శాతం	13.80	13.30	14.00	15.93
హరిజనులు గ్రామీణజనాభా	44.21	50.92	67.82	87.58
హరిజన జనాభాలో శాతం	88.90	88.18	84.81	82.69
విద్య	4.21	6.15	14.04	27.42
విద్యశాతం	8.47	10.65	17.65	31.58
మహిళలో విద్యశాతం	3.40	5.30	10.25	17.12
మొత్తం పనివారు	28.09	29.77	43.20	51.72
వ్యవసాయ కార్మికులు	23.82	25.52	34.32	43.87

(రాష్ట్ర ఆర్థిక సర్వే నుండి)

గ్రామీణ హరిజన జనాభా శాతం దాదాపు స్థిరంగా ఉంది. 17 శాతం జనాభా మాత్రమే పట్టణాలలో నివసిస్తున్నారు. నగరంలోని వారిలో కొంతమేర విద్యావ్యాప్తి ప్రభావం ఉంది. మహిళలలో విద్య చాలా తక్కువ. గ్రామీణ హరిజనులు నేటికీ భూమికి దూరంగానే ఉంచబడుతున్నారు. 1991లో సగటు కమతం విస్తీర్ణం 0.91

హెక్టార్లుకాగా 1995-1996 నాటికి 0.84 హెక్టార్లకు తగ్గింది. మొత్తం హరిజనులవద్ద గల భూమి 1995-1996లో ఈ విధంగా ఉంది.

కమతంసైజు (హెక్టార్లు)	మొత్తం కమతాలు	మొత్తం భూమి (హెక్టార్లు)
0.0-0.5	631850	168280
0.5-1.00	312292	227836
1.00-2.00	227540	317221
2.00-3.00	75976	175038
3.00-4.00	19315	65594
4.00-5.00	8699	38378
5.00-7.00	6592	39095
7.50-10.00	1913	16233
10.00-20.00	1105	13933
20.00 పైన	119	4999
మొత్తం	**12,85,401**	**10,66,652**

సగటు కమతం 0.84 హెక్టార్లు మాత్రమే. రాష్ట్రంలో మొత్తం కమతాలలో వీరు 13 శాతంగా ఉన్నారు. మొత్తం భూమి 143.73 లక్షల హెక్టార్లు కాగా హరిజనులవద్దనున్నది 10.66 లక్షల హెక్టార్లు మాత్రమే (7.42 శాతం మాత్రమే) వ్యవసాయ కార్మికులు 43.87 లక్షలు (1991 నాటికి) ఉన్నారు. వీరిని కూడా పరిగణనలోనికి తీసుకుంటే సగటు కమతం తగ్గుతుంది. 1991లో 11,83,407 కమతాల చేతులలో 10.82,280 హెక్టార్ల భూమి ఉంది. 1995-96 నాటికి ఆ భూమి 10,66,652 హెక్టార్లకు తగ్గింది. కమతాల సంఖ్య కూడా 10,19,94. కు తగ్గాయి. గతంలో ఉన్నవారు భూములో కోల్పోయారు.

ప్రభుత్వ భూమి కొనుగోలు పథకం :

రాష్ట్ర ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి హరిజనులకివ్వాలని 1982లో పథకాన్ని ప్రవేశపెట్టింది. మార్కెట్టు ధరకే భూములు కొని హరిజనులకివ్వాలి. 1982 నుండి 2003 మార్చి నాటికి ప్రభుత్వం ఈ పథకం క్రింద (14 సంవత్సరాలలో) రు. 138.79 కోట్ల వ్యయంచేసి 60331.24 ఎకరాలు కొనుగులు చేసింది. ఈ భూమిని 48,294 మందికి పంచింది. ఏటా సగటున రు. 10కోట్లు వ్యయం చేసింది. ఈ స్వల్పమొత్తాన్ని కేటాయించడానికే ప్రభుత్వం ఇబ్బందిపడ్తున్నది. రాష్ట్రంలో 1.20 కోట్ల ఎకరాల భూమి పడావు భూమిగా ఉన్నది. ప్రభుత్వ భూమి సీలింగు భూములు చట్టబద్ధగా దళితులకు పంపిణీ చేస్తే కుటుంబానికి ఒక ఎకరం ఇవ్వడం పెద్ద సమస్య కాదు. ఈ కొనుగోలులో కూడా అనేక కుంభకోణాలు చోటుచేసుకున్నట్లు ప్రచారం ఉంది. వాస్తవ మార్కెట్టు రేటుకన్నా అదనపు చెల్లింపులు, లేదా పేదల భూములేకొని వారికిచ్చినట్లు ఆరోపణ ఉంది. వాస్తవానికి భూముల కొనుగోలు కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలుపరిస్తే ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమిని ఇవ్వవచ్చును. భూమితోపాటు విత్తనాలు, భూమి అభివృద్ధికి, సాగునీటికి తగు రుణాలు ఇస్తే వారికి ఆ భూమి వలన ప్రయోజనం చేకూర్తుంది. ఒక్క భూమి మాత్రమే ఇవ్వడం వలన ఏ మాత్రం ప్రయోజనం లేకపోగా, గతంలో వచ్చే కూలీకి కూడా నష్ట పోతారు. సామూహిక సాగునీటి బావులు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నిర్వహించి పంటలపై మెట్టుపంటకు ఎకరాలు రు. 75/-, మాగాణికి రు. 150/- చొప్పున నీటితీరువా వసూలు చేసే విధంగా నిర్ణయించాలి. భూసమారాధన పేర తెలుగుదేశం చేసిన ప్రచారం హరిజనుల వరకు చేరలేదు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కాని, వారి శ్రమశక్తిని పూర్తిగా వినియోగంలోకి తెచ్చేవిధంగా ఉత్పత్తి సాధనమైన భూమి వారికి అందుబాటులోకి రాలేదు. పైగా ఉన్న భూములు కోల్పోతున్నారు. విద్య లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల నివాసం ఉండడం వలన మరో ఆదాయవనరు లేక ఆగర్భదరిద్రులుగా మారుచున్నారు.

పట్టణాలలో హరిజనులు :

హరిజన జనాభా పట్టణాలలో 1961లో 11.1 శాతం కాగా 1991 నాటికి 17.31 శాతం పెరిగింది. జనాభారీత్యా 1991 నాటికి 18.33 లక్షల మంది పట్టణాలలో నివసిస్తున్నారు. 1961లో పట్టణాలలోని జనాభా 5.52 లక్షలు మాత్రమే. అరకొర రిజర్వేషన్లు అమలు వల్ల ఉద్యోగాలు చేస్తున్నా, వారి జనాభా నిష్పత్తికి తగినవిధంగా లేవు. ఉన్నతవిద్యకు నోచుకోకపోవడం వలన ఉన్నత ఉద్యోగాలు వీరికి అందుబాటులో లేవు. రిజర్వేషన్లు ఉన్నా తగిన అభ్యర్థులు లేరని వాటిల్లోకి ఇతరులను రిక్రూట్ చేస్తున్నారు.

ప్రస్తుత ఉద్యోగాల స్థితి, శాతం ఈవిధంగా ఉన్నాయి.

రంగం	1988		1994	
	ఉద్యోగులు	శాతం	ఉద్యోగులు	శాతం
రాష్ట్ర ప్రభుత్వం	86031	18.9	105201	21.0
న్యాయవ్యవస్థ	991	8.5	1286	10.4
ఎయిడెడ్ పాఠశాలలు	2285	7.0	2734	8.0
స్థానిక సంస్థలు	46451	18.8	54898	20.7
ఇతర (స్థానిక)	962	12.8	1193	14.7
రాష్ట్రపబ్లిక్ సెక్టార్	40474	15.7	51006	17.2
యూనివర్శిటీ	1975	12.1	2631	13.2
సహకారరంగం	3752	9.3	-	-
దేవాలయాలు	-	-	1716	9.5
మొత్తం	**1,79,169**	**17.4**	**22,4,417**	**18.8**

కీలక రంగాలు, ప్రధాన ఉన్నత ఉద్యోగాలు ఎండమావిగానే ఉన్నాయి.

రిజర్వేషన్ల సమస్యపై ఉద్యమాలు వచ్చాయి. కొన్ని ఉద్యమాలు హరిజన ఐక్యతకు నష్టం కలుగచేశాయి. రాష్ట్ర ప్రభుత్వం వీరిని ఎ.బి.సి.డి.లుగా చేసి వీరిలో వీరికే తగవులు పెట్టింది. గ్రామీణ హరిజనులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం, పాలకవర్గం పథకం ప్రకారమే వీరిని ఉత్పత్తి సాధనాలకు శ్రమకు దూరంగా పెడ్తున్నది. పై గణాంకాలు పరిశీలిస్తే హరిజనులకు పాలకులు కల్పించిన అభివృద్ధి ఏపాటిదో గమనించవచ్చు. పాలకులకు వీరు ఎన్నికలప్పుడే గుర్తుకు వస్తారు.

గిరిజనులు :

అటవీ ప్రాంత గిరిజనులు - మైదాన ప్రాంతాల గిరిజనులుగా యున్నవీరిని 1976లో రాష్ట్ర ప్రభుత్వం ఒకటిగా చేసింది. వీరికి కొన్ని ప్రాంతాలు రిజర్వు చేసి షెడ్యూలు ప్రాంతాలుగా కేటాయించింది. మిగిలిన ప్రాంతాలలోని గిరిజనులకు "మాడా" పథకాన్ని ప్రకటించి అభివృద్ధి చేయటగానికి ప్రణాళికలు రూపొందించారు. వీరు భూమి ప్రధానంగా జీవిస్తారు. భూమి లేకుండా ఉండలేరు. అయినా వీరిని కూడా దళితుల స్థితికే పాలకవర్గం నెట్టింది. 1961 నుండి 1991 నాటి స్థితి చూడండి (లక్షలలో)

వివరం	1961	1971	1981	1991
గిరిజన జనాభా	13.24	16.58	31.71	41.99
జనాభాలో శాతం	3.68	3.81	5.93	6.31
గ్రోత్‌రేటు శాతం	72.69	25.16	97.60	32.23
గ్రామీణ జనాభా	12.67	15.73	29.79	38.80
గిరిజన జనాభాలోశాతం	95.70	94.90	93.80	92.40
విద్య (లక్షలు)	0.58	0.89	2.48	5.72
విద్య శాతం	4.40	5.40	7.80	17.20
స్త్రీల విద్యశాతం	1.50	2.10	3.50	8.70
వ్యవసాయ కార్మికులు	2.98	6.66	13.64	18.70

(రాష్ట్ర ఆర్థిక సర్వే ఆధారంగా)

వీరి జనాభా 3 రెట్లు పెరిగినా వనరులు ఆ స్థాయిలో పెరుగలేదు. వీరిలో 93 శాతం జనాభా గ్రామీణంగానే ఉన్నారు. అటవీ గిరిజనులు మైదాన గిరిజనులకన్నా కదుదారిద్ర్యంలో ఉన్నారు. ఏదేమైనా అటవీ, మైదాన గిరిజనులు విద్యా, వైద్యం, ఆవాస రంగాలలో అతినికృష్టంగానే ఉన్నారు.

వీరి వద్దనున్న భూవసతి (1995-96)ని పరిశీలించండి. (హెక్టార్లు)

కమతం సైజు హెక్టార్లు	మొత్తం కమతాలు	మొత్తం కమతాలలో శాతం	మొత్తం విస్తీర్ణం హెక్టార్లు	మొత్తం విస్తీర్ణం
0-1	389117	51.59	195472	17.98
1-2	190622	25.27	269911	24.83
2-4	127849	16.95	336663	30.97
4-10	43105	5.71	237827	21.88
10పైన	3442	0.45	46943	4.31
మొత్తం	7,54,135	100	10,86,816	100

7.54 లక్షల మంది వద్ద 10.86 లక్షల హెక్టార్లుంది. (వ్యవసాయ కార్మికులు 18.70 లక్షల మంది ఉన్నారు) సగటు కమతం 1.44 హెక్టార్లు మాత్రమే 2 హెక్టార్లలోపు వారు 77 శాతం ఉన్నారు. అడవి బంజర్లు వీరి స్వాధీనంలో ఉన్నా వీరికి హక్కులు లేవు. వీరి భూముల రక్షణకు గతంలో చట్టాలు చేశారు.

1. ఎ.పి. షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదిలీ రెగ్యులేషన్ 1959
2. ఎ.పి. షెడ్యూల్డు ప్రాంతాల వడ్డీ వ్యాపారుల రెగ్యులేషన్ 1960
3. ఎ.పి. షెడ్యూల్డు ప్రాంతాల రుణవిమోచన రెగ్యులేషన్ 1960
4. ఎ.పి. షెడ్యూల్డు ప్రాంతాల రుణవిమోచన రెగ్యులేషన్ 1970

ఈ చట్టాలేవీ వారి భూములకు రక్షణ కల్పించలేకపోయాయి. వీరి భూములు గిరిజనేతర భూస్వాములకు అన్యాక్రాంతం అవుతూనే ఉన్నాయి. చివరకు ప్రభుత్వమే రక్షణ చట్టలు తొలగించబూనుకుంది. కార్పొరేటు సంస్థలకు హస్తగతం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుత పాలక తెలుగుదేశ ప్రభుత్వం చట్టాలను తిరగదోడే ప్రయత్నం చేస్తున్నది. తమ భూముల కోసం తమ ఉద్యమించిన గిరిజన పేదలపై దమనకాండ సాగిస్తున్నది. పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి, బుట్టాల్లా గూడెం మండలాలు ఇందుకు ప్రతీకలుగా ఉన్నాయి. ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు భూస్వాములు వీరిపై ఏకకాలంలో దాడులు చేస్తున్నారు. చట్టాలను ఘోరంగా ఉల్లంఘిస్తున్నారు. శాసనసభలో ప్రభుత్వం చెప్పిన ప్రకారం అన్యాక్రాంతం అయిన భూముల వివరాలు (ఎకరాలు)

వివరం	సంఖ్య	భూమి విస్తీర్ణం
1. అక్రమ ఆక్రమణలు	69170	3,04,582
2. పరిష్కరించబడిన కేసులు	61071	2,66,423
3. భూమి గిరిజనులకు ఇచ్చినది	27538	1,03,413

ఇంకా 2 లక్షల ఎకరాలపైగా అక్రమ ఆక్రమణలో ఉన్నది. ప్రత్యేక ప్రభుత్వ శాఖవున్నా వారు భూస్వాములకు అనుకూలమే. 2001-02లో రూ.820 కోట్లు బడ్జెటు కేటాయించారు. దీని వలన లబ్దిపొందింది మెజార్టీ మధ్యదళారులే.

ఇండ్లస్థలాల పంపిణీ :- ఏటా ఇండ్లస్థలాల పంపిణి, ఇండ్ల నిర్మాణం ప్రహసనంగా మారింది. 31-3-2001 నాటికి ప్రభుత్వ ఆర్థిక సర్వే ప్రకారం హరిజన, గిరిజన, వెనుకబడిన కులాలవారికి 10,36,969 మందికి 34289.59 ఎకరాలు పంచినట్టు సమాచారం. ఇందులో దళితులకు చెందింది ఎంతో ప్రభుత్వమే చెప్పాలి. నేటికి ఇండ్లులేనివారి సంఖ్య లక్షల్లోనే ఉంది.

(మిగతా భాగం వచ్చే సంచికలో)

దేశాన్ని 'వెలిగించ'డానికి తగలబెట్టడమూ ఒక మార్గమే

– కె. బాలగోపాల్

అతినీచమైన విద్వేష రాజకీయాల నుండి మధ్యతరగతిని ఆకర్షించే 'అభివృద్ధి' ప్రేలాపన దాకా ఒక పెద్ద వారధి నిర్మించి దానిపైన అధికార శిఖరాలకు పరుగులు పెడదామన్న ఆలోచన భారతీయ జనతాపార్టీ నాయకులలో స్పష్టంగానే కనిపిస్తున్నది. వాళ్లు గుజరాత్‌లో పచ్చి ద్వేషాన్ని ప్రచారం చేసి గెలిచారు. ఆ తరువాత జరిగిన మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికలలో ట్యూన్ మార్చి 'అభివృద్ధి' గురించి మాట్లాడి గెలిచారని పత్రికలు మనకు చెప్తున్నాయి. ఊరికే చెప్పడం కాదు, అదేదో గొప్ప ఎత్తుగడ అయినట్టు పొగిడాయి కూడా. భారతీయ జనతా పార్టీ జనసంఘ్‌గా ఉన్న రోజులలో సహితం వారిలో 'మంచి'ని చూడాలన్న ఆరాటం మధ్య తరగతిలో చాలా ఉండింది. ఇప్పుడది నిండుగా వికసించింది.

నిన్నటి రోజు ద్వేషాన్ని పక్కనపెట్టి అభివృద్ధి పాటపాడిన వారు రేపు అభివృద్ధికి గోలీమారో అని చెప్పి తిరిగి ద్వేషాన్ని ప్రచారం చేసే ఎన్నికల ఎత్తుగడ అనుసరించగలరు. మొన్న హైదరాబాద్‌లో జరిగిన ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో, బిజెపి నుడికారం మారిపోయిందనిపించే ప్రకటనలు, వ్యాఖ్యలు ఒక పక్కన వెలువడుతుండగా లాల్‌కిషన్ అద్వానీ ఏమీ మారలేదని స్పష్టం చేస్తూ ఉపన్యసించాడు. గుళ్లు గోపురాలు సంగతి మరచిపోలేదని హామీ యిచ్చాడు.

అయినా ఓట్ల చాపల్యం భారతీయ జనతాపార్టీ నాయకులను 'తప్పుదోవ' పట్టించే ప్రమాదముందని భావించిన విశ్వహిందూ పరిషత్ నేతలు దాదాపు అదే సమయంలో హైదరాబాద్‌లో తమ కార్యవర్గ సమావేశమో, మరొకటో నిర్వహించుకొని చెక్కుచెదరని హిందూత్వ విషాన్ని కక్కారు. ఈ దేశంలో హిందువులను కాపాడే పార్టీ ఒక్కటి కూడ లేదన్న సవాలును బిజెపికి హెచ్చరికగా ప్రకటించారు. భారతీయ జనతాపార్టీ లాగే విశ్వహిందూ పరిషత్ కూడ ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నలలో నడుచుకుంటుందని గుర్తుంచుకుంటే మనం విన్నది భిన్నస్వరాలు కాదనీ అంతా కలిసి ఒకే స్వరం వినిపిస్తున్నారనీ అర్థం చేసుకోగలుగుతాం.

కానీ తేడా చూడడానికి కంకణం కట్టుకున్న మేధావివర్గమొకటి ఈ దేశంలో ఉంది. వాజ్‌పేయి భారతీయ జనతాపార్టీ గమ్యాన్ని మార్చేసాడనీ, అభివృద్ధి అజెండాను స్థిరంగా నిలబెట్టేశాడనీ కలకత్తా నుండి ప్రచురితమయ్యే టెలిగ్రాఫ్ దినపత్రిక సంపాదకీయమే రాసేసింది. శరీరంలో ఏ అవయవమయినా పనిచేస్తున్నదా అని అనుమానం వేసే ఆ వృద్ధుడి గుణగణాల మీద వారికి నిజంగా అంత విశ్వాసముందనుకోవాలా, లేక నమ్మదలచుకున్నది నమ్ముతున్నారా?

భారతీయ జనతాపార్టీ సారథ్యంలో ఇండియాకు అంతర్జాతీయ రంగంలో కొత్త గుర్తింపు, గౌరవం లభించాయనీ చైనా గురించి మాట్లాడుకున్న స్వరంతో ఇప్పుడు ఇండియా గురించి మాట్లాడుకుంటున్నారనీ, ఇండియా "వెలిగిపోతున్న"దనీ కార్యవర్గ సమావేశానికొచ్చిన బిజెపి నాయకులన్నారు. అది వెలుగే అయితే, దానిని సాధించడం ఘనతే అయితే దానికి వాజ్‌పేయికి ఎంత కితాబు ఇవ్వాలో పి.వి. నరసింహారావుకూ, మన్మోహన్‌సింగ్‌కు కూడా అంతే ఇవ్వాలి.

భారతదేశపు "మధ్యతరగతి మార్కెట్" వలన విశ్లేషకులు చెప్పుకునేంత ఆకర్షణీయంగా విదేశీయులకు కనిపించకపోయినప్పటికీ మన పాలకులు ప్రపంచబ్యాంకు ఆర్థిక సంస్కరణల పంథాలో ప్రయాణించడం మొదలుపెట్టిన నాటినుండి పాశ్చాత్యుల ఆకలిగొన్న కళ్లకు ఇండియా కొంచెం కొత్తగా కనిపిస్తున్న మాట సత్యమే. ఐటి రంగంలోనూ మొత్తంగా కమ్యూనికేషన్ రంగంలోనూ ఇండియన్లకు కొంత గుర్తింపు లభించిన మాటా సత్యమే. భారతీయులెవరయినా వెలిగిపోతుంటే అది ఈ వర్గమేనని చెప్పుకోవచ్చు. అయితే ప్రవాస భారతీయుల సదస్సులు జరిపి ఈ వెలుగును ప్రదర్శించుకోవడం తప్ప దీనికి ఇదొక గొప్ప విషయమని అనుకున్నా భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా చేసిందేమీ లేదు.

పాకిస్తాన్‌తో స్నేహసంబంధాలు మెరుగుపడే వాతావరణం నెలకొల్పిన ఘనతా వీరిదేనని వీరు చాటింపు వేసుకుంటున్నారు. వారు పాడుచేసిన దానిని వారే బాగుచేస్తున్నారు తప్ప కొత్తగా చేసిందేమీ లేదు. వేరే ఏ పార్టీ అయినా చేస్తే వీరే అడ్డం పడుదురు. పాకిస్తాన్‌తో బస్సు, రైలు, విమానాలు రద్దుచేసింది వీరి ప్రభుత్వమే. వాటిని చాలా ఆలస్యంగా పునరుద్ధరించి అది కూడ అపూర్వమైన ఘనకార్యమేనంటే ఎట్లా? ఇక చర్చల మాటకొస్తే ఈ రెండు దేశాలనూ చర్చల వైపు నెట్టింది అమెరికా అనేది అందరూ ఎరిగిన రహస్యమే. ఇస్లామాబాద్

ప్రకటన వెలువడిన నాడే అమెరికా అంత మాట అనేసింది. అదేమీ లేదని మనవాళ్లు తెలిపిన అభ్యంతరానికి అమెరికా జవాబు సహితం చెప్పలేదు. పాకిస్తాన్‌లోని సరిహద్దువద్ద భారత్ ఏడు లక్షల సైన్యాన్ని మొహరించి ఏ క్షణమైనా యుద్ధానికి పాల్పడవచ్చునన్న వాతావరణాన్ని కల్పించి సంవత్సరంన్నర కాలేదు. అంతలోనే మన పాలకుల మనసు నిజంగా మారిపోయి, శాశ్వతమైన శాంతికి వారు మనస్ఫూర్తిగా కృషి చేస్తున్నారని నమ్మాలా? పాకిస్తాన్‌ను ఎప్పటికయినా జయించి భారత్‌లో కలుపుకోవడం అనే లక్ష్యాన్ని వారి శాఖలలో దశాబ్దాలుగా నూరిపోస్తున్నారు. దానిని వదులుకున్నామని ఒక్కమాట చెప్పమనండి చూద్దాం.

బయట దేశాన్ని వెలిగింప చేస్తున్నారట, ఆ "విజయాన్ని" చెప్పుకొని ఇంట్లో ఎన్నికలకు దిగుతారట. దేశం లోపల ఏం చేస్తున్నారో ఒకసారి గమనించండి. ద్వేషాన్ని వ్యాపింపచేయడం దేశం లోపల వీరి ప్రధాన అజెండా. ముస్లింలపట్ల ద్వేషం, క్రైస్తవులపట్ల ద్వేషం, అభ్యుదయంపట్ల ద్వేషం, స్వేచ్ఛపట్ల ద్వేషం, భిన్నత్వంపట్ల ద్వేషం– ఇది వీరి అజెండా. దానిని అమలుచేయడం అపారేమో ఒకసారి అడగండి.

ఎన్నికలను ఆహ్వానిస్తూ సంఘ్ పరివార్ రాజకీయ ముఖం అయిన భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన ప్రకటనలలో, వ్యాఖ్యలలో, ఆ పార్టీ నాయకత్వాన సాధించిన ఆర్థికరంగ అభివృద్ధి, ఇండియా 'ఇమేజ్'ను అంతర్జాతీయంగా పెంచిన వైనం ఇస్లామాబాద్ ప్రకటన మొదలైన విషయాలు మాత్రమే ఉన్నాయి. వారి పరివారంలోని ఇతర సోదరులు సాధించిన 'విజయాల' ప్రస్తావన లేదు. ఆ పరివారంలో తేళ్లు, జెర్రులూ ఉన్నాయి. వాటి నుండి తాము దూరం అయినట్టు మాటవరసకు కూడ బిజెపి నాయకులు ఎన్నడూ అనలేదు. అనకపోగా, బిజెపికి సంపూర్ణ మెజారిటీ లభించినప్పుడు తమ అసలు అజెండా అమలు చేస్తామనీ దానికి వదిలిపెట్టలేదనీ పదేపదే వారు ప్రకటిస్తున్నారు. ఆ 'అసలు అజెండా' భజరంగ్ దళ్ అజెండా, విశ్వహిందూ షరిషత్ అజెండా, ఆర్ఎస్ఎస్ అజెండా దానిని అమలు చేసిన గుజరాత్‌ను దేశానికే నమూనాగా బిజెపి నాయకులు అలుపెరగకుండా కీర్తించిన సంగతి మనం మరచిపోకూడదు. బిజెపి ఎక్కడ అధికారంలో ఉన్నా అక్కడంతా తమ పరివారంలోని విషపురుగులను స్వేచ్ఛగా సంచరించనిస్తుంది. వారు చేసే విధ్వంసాన్ని చూసీచూడనట్టు పొమ్మని తన అదుపులోని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశిస్తుంది. వారు చేసే దైనందిన విద్వేషవ్యాప్తి యదేచ్ఛగా సాగుతుందిగానీ ఎప్పుడయినా వారు మీరు అన్యాయమైన పనిచేస్తున్నారని ఢిల్లీలోని వారి ప్రధాన ముఖోటా ఆవేదన వ్యక్తం చేస్తాడా? స్పష్టంగా చెప్పటం ఇబ్బంది అనిపిస్తే ఎప్పుడయినా ఆ తరువాత విశ్రాంతి కోసం కేరళకో కన్యాకుమారికో పోయినప్పుడు ఒక కవిత రాసి దేశంమీద వదులుతాడు. దాన్ని పట్టుకొని చూసావా బిజెపి మారిపోయింది అంటూ మీడియా విశ్లేషకులు, మేధావులు సంబరపడిపోతుంటారు.

కానీ జరిగేది జరుగుతూనే ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్‌ల నుండి ఒరిస్సాదాకా ఆదివాసులలో ద్వేష రాజకీయాలను వ్యాపింపజేయడంలో ప్రధాన పాత్ర వహించిన వనకళ్యాణ్ పరిషత్ అనే సంఘ్‌పరివార్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీలోకి కూడ ఈ మధ్యనే ప్రవేశించిన సంగతి ఎంతమంది గమనించారు? మొన్నటిదాకా రాజకీయంగా అమాయకులయిన ఎన్‌జివోలుగా వ్యవహరించిన వారు వారికి అండగా నిలబడ్డారు. సదస్సులూ, కార్యక్రమాలూ చేపడుతున్నారు. ప్రస్తుతం ఆదివాసీల హక్కుల గురించే మాట్లాడుతున్నారు. కొంచెం బలంపుంజుకున్న తరువాత క్రైస్తవ మిషనరీలపైన ద్వేష ప్రచారం ప్రారంభిస్తారు. ఆగ్రహమే తప్ప ద్వేషం ఎరుగని ఆదివాసీ సంస్కృతికి ద్వేషం నేర్పిస్తారు. ఆ ద్వేషం క్రైస్తవం దగ్గర ఆగదు. దానిని సంఘ్ పరివార్ రాజకీయాలకొక సాధారణ ఆయుధంగా మలచుకుంటారు. అంతా జరుగుతూనే ఉంటుంది. భారతీయ జనతా పార్టీకి ఎక్కడ అధికారం ఉంటే అక్కడ దాని గొడుగుకింద ఇదంతా భద్రంగా సాగిస్తుంటుంది. తనకు స్వంతంగా అధికారం లేనిచోట మిత్రపక్షాల అధికారాన్ని (అది తెలుగుదేశం కావచ్చు, అన్నాడిఎంకె కావచ్చు) అందుకోసం వాడుకుంటుంది. కానీ బిజెపి మాత్రం ఈ అజెండా గురించి మాట్లాడడం మానేసి 'ఇండియా వెలిగిపోతోంది' అంటూ ప్రవాసం మీద కన్నున్న మధ్యతరగతిని ఆకర్షించే ప్రవచనాలకు తన ప్రచారంలో పెద్దపీట వేస్తుంది. 'చూసావా, వాళ్లు మారిపోయారు' అని మీడియా పెద్దలు విశ్లేషిస్తుంటారు. మీడియాను మధ్యతరగతినీ ఆకర్షించడానికి ప్రధాని ముఖోటయేకాక ఎంతటి చమత్కారి? ఎవరికీ హాని చేయడనిపించే ప్రమోద్ మహాజన్, ఇప్పుడే ఇంగ్లండ్ నుండి దిగొచ్చినట్టు కనిపించే జస్వంత్‌సింగ్, పిల్లలకు బిస్కట్లు కొనిచ్చే పక్కింటి మామయ్యలాంటి వెంకయ్యనాయుడు వంటివాళ్లు చాలా మంది ఉన్నారు. వీళ్లంతా దారాసింగ్‌నూ ప్రవీణ్ తొగాడియాను సమర్థిస్తూ మాట్లాడినప్పుడు వీళ్లలోని విషం బయటపడుతుంటుందిగానీ మామూలుగా వీళ్లు ఇండియాను 'వెలిగింప'జేసే పెద్ద మనుషులుగానే చెలామణీ అవుతుంటారు. అయినా దేశాన్ని తగలబెట్టడం కూడ వెలిగింపజేసే ఒక మార్గమే కదా!

○

మళ్లీ మద్యనిషేధం: దీర్ఘకాలిక పోరాటం

- మల్లాది సుబ్బమ్మ

1995లో మద్య నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేశాక మహిళల్లో, సమాజంలో నిర్వీర్యత, నిశ్చలత్వం చోటుచేసుకుంటున్నాయి. మానసికంగా కృంగిపోయి ఎనలేని బాధతో కృంగిపోతూనే వున్నారు. మళ్లీ ఉద్యమాన్ని ఎలా పునరుద్ధరించాలా అని తహతహలాడిపోతున్నారు. అంతటి మహోద్యమాన్ని ప్రభుత్వం తన ఉక్కుపాదంతో అణిచివేసిన గాథ మన కళ్ళముందే తిరగాడుతోంది.

అదొక అశనిపాతమై ఉద్యమకారుల్ని, సమాజాన్ని అగౌరవపరిచింది. ఓడిపోయామనే వ్యధ మా మనస్సుల్ని కలిచివేసింది. 8 కోట్ల ఆంధ్రులను నిర్వీర్యపరిచింది. బి.బి.సి తదితర ప్రపంచ దేశాలచే పొగడబడ్డ మహోద్యమం ఇలా నీరుగారి పోవడం వల్ల ఎవరికి వారే బాధాసర్పద్రష్టులై మిన్నకున్నారు. కాని నాటి నుండి సారా ఏరులై ప్రవహించడం జరుగుతూనే వుంది. రోజురోజుకి షాపులు పెంచి లైసెన్సుల ద్వారా కోట్లకొద్దీ ధనార్జన చేస్తోంది ప్రభుత్వం. చీప్ లిక్కరు, కల్తీసారా త్రాగినవారి మరణాలు వందల సంఖ్యలో పెరుగుతూనే వున్నాయి. కూటికి, గుడ్డకు నోచుకొని కుటుంబాలు తారాస్థాయికి చేరుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు విపరీతంగా త్రాగడం మొదలయింది. మద్యం షాపులువాడలా పవిత్రమైన దేవాలయాలు, చర్చిలు, మసీదులు, స్కూళ్ళకు అతిదగ్గరలో చట్టానికి వ్యతిరేకంగా వెల్లివిరిసాయి. సారా త్రాగి బస్సులు, లారీలు, ఆటోలు నడపడంవల్ల ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. చనిపోయే వారి సంఖ్య, యాక్సిడెంట్లు లెక్కకు మిక్కుటంగా వుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో మేధావులు, సంఘ సేవకులు, ఉద్యమాభినులు, స్త్రీలు అందోళనతో ఈ దుర్వ్యసనాన్ని ఎలా రూపుమాపాలని అందోళన చెందుతున్నారు. భావసామీప్యత, ఉద్యమాభిమానులు కలిసి ఈ పరిస్థితుల్లో మళ్ళీ ఉద్యమాన్ని పునరుద్ధరిద్దామని సంకల్పించాము.

మద్య వ్యతిరేక ఉద్యమానికి తిరిగి వూపిరి పొయ్యాల్సిన అవశ్యకతను గుర్తించి వివిధ మహిళాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యమాభిమానులు, సామాజిక సంస్కర్తలు, అనుభవజ్ఞులైన విశిష్ట వ్యక్తులతో 7/9/2003న 'జన విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో సమావేశమై "మద్య వ్యతిరేక ఐక్యవేదిక" ను స్థాపించాము. ఈ సన్నాహక కమిటి సమావేశంలో సంపూర్ణ మద్యనిషేదం అంతిమ లక్ష్యంగా మద్య వ్యతిరేక ఉద్యమాన్ని అంచెలంచెలుగా ముందుకు తీసుకువెళ్ళాలని ఏకగ్రీవంగా తీర్మానించాము. మాజీ ప్రభుత్వ కార్యదర్శి అర్జునరావు, ప్రముఖ పాత్రికేయులు ఎ.బి.కె. ప్రసాద్, పొత్తూరి వెంకటేశ్వరరావు, వి.కృష్ణ, వి.లక్ష్మణరెడ్డి తదితరులు మెంబర్లుగా వున్నారు. ఈ సన్నాహక కమిటీ బెల్టు షాపులను శాశ్వతంగా మూసివేస్తూ ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని, మద్యాన్ని ప్రభుత్వ ఆదాయ వనరులుగా చూడరాదని, చీప్ లిక్కరును రద్దుచేయాలని, బార్లను నిషేధించాలనే లాంటి సమస్యల సాధన కోసం శాంతియుతంగా దీర్ఘకాలంగా అహింసా పద్ధతులతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఈ లక్ష్యాల సాధనకోసం శాంతియుతంగా దీర్ఘకాలంగా అహింసా పద్దతులలో పోరాడాలని నిర్ణయించడం జరిగింది. అలాంటి లక్ష్యాలు, ధ్యేయాలతో ఈ కమిటిని స్థాపించడం జరిగింది. ఐక్య వేదికలో మహిళాభ్యుదయాన్ని, కుటుంబ శ్రేయస్సును, ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే వ్యక్తులను, సంస్థలను, మద్యానికి వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నిటిని కలుపుకొని విస్తృత ప్రాతిపదికన ఒక విశాల వేదికను ఏర్పాటుచెయ్యాలనే సంకల్పంతో శ్రీమతి పశ్య పద్మ, వి.సంధ్య, వి. రవిప్రకాష్, డా॥ సి.రామచంద్రయ్య, రత్నమాల, నందమూరి లక్ష్మీపార్వతి, కె.బి.తిలక్, ప్రేమ్‌పావని తదితరులతో ఐక్యవేదిక సభ్యులుగా ఎన్నుకోవడమైనది. ప్రప్రథమంగా ఆక్టోబరు 2, 2003న గాంధీ జయంతినాడు నిరసన దీక్షలు నిర్వహించడం జరిగింది. గాంధీ విగ్రహానికి దండవెయ్యటానికి వెళ్ళిన మా కార్యకర్తలనీ, ఇతర సభ్యులను లోనికి పోనివ్వకుండా గేటువద్దనే అరెస్టుచేసి పోలీసు స్టేషనుకు పంపారు. సాయంత్రానికి విడుదలయిన మేము, గౌరు తిరుపతిరెడ్డి నిర్వహించిన 'మద్యంపై చేయాలి యుద్ధం' అనే సభకు వి.సంధ్య, ఎస్.పుణ్యవతి, ప్రేమ్ పావని, స్వరూపరాణి

తదితరులు హజరై "మద్యం తుఫానులో మనం, మన తరాలు కొట్టుకుపొయ్యే పరిస్థితి ఆసన్నమయింది. మద్యం చేసిన, చేస్తున్న, చెయ్యబోయే ఘోరాలు ఎన్నో వున్నాయి. అటు దళారుల చొరవ ద్వారా మద్యం మంచినీటిని మించి నగరాలలో, పల్లెల్లో పొంగి పొర్లుతూ వుంది. ఎవరికైనా తింటున్నప్పుడు గొంతు ఎండిపోతే గ్లాసుడు మంచినీళ్ళు దొరకదు కాని సీసాలకొద్ది మందుమాత్రం లభిస్తూ వుంది. ఈ పరిస్థితుల్లో మనమంతా మళ్ళీ మద్యంపై సమరం చెయ్యటానికి ఏకం కావాలని" ఈ సభలో ప్రసంగించాము. ఈ సభాధ్యక్షులు స్వర్ణకంకణ గ్రహీత, వృక్షమిత్ర, గృహ సంస్కర్త గౌరు తిరుపతిరెడ్డి సారా నిషేధ ఉద్యమనేత దూబగుంట రోశమ్మకు, టంగుటూరి అన్నపూర్ణమ్మకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయంతో సన్మానించారు. 'మద్యంపై రాజీలేని యుద్ధం' అనే పుస్తకాన్ని ఈ సభలో ఆవిష్కరించారు.

31/10/2003న మద్యం వ్యతిరేక ఐక్యవేదిక తరుపున మేము రాష్ట్ర గవర్నరు సూర్జిత్‌సింగ్ బర్నాలాకు మెమోరాండం సమర్పించాము. అందులో బెల్టు షాపులను రద్దు చెయ్యాలని, వెంటనే చీప్ లిక్కరును ఎత్తివేయాలని, సిట్టింగ్ బార్లను, సింగింగ్ బార్లను రద్దు చెయ్యాలని, వెంటనే చీప్ లిక్కరును ఎత్తివెయ్యాలని, సిట్టింగ్ బార్లను, సింగింగ్ బార్లను రద్దు చెయ్యాలని, పవిత్రమైన దేవాలయాలు, మశీదులు, దర్గాలు, గురుద్వారాలు, దేవా స్కూళ్ళు లాంటి వాటి దగ్గరగా వున్న షాపులకు లైసెన్సులు యివ్వకూడదని, మద్యం వల్ల వచ్చే ఆదాయాన్ని మేజర్ ఇన్‌కంగా గుర్తించి ఎక్సైజ్ డిపార్టుమెంటు వారికి టార్గెట్‌లను నిర్ణయించరాదు. ప్రతి గవర్నమెంటు హాస్పటల్సులో డి-ఎడిక్షన్ సెంటర్లును పెట్టి వాటి ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. గ్రామ ప్రజలు 'మా గ్రామాలలో మీరూ లిక్కరు షాపులు పెట్టవద్దని' కోరినప్పుడు ఆ ప్రాంతాలలో పాత మద్యం షాపులకు లైసెన్సులు రద్దు చెయ్యాలి : అలాగే కొత్త వాటికి లైసెన్సులు యివ్వకూడదనే ఈ డిమాండ్లతో వినతి పత్రాన్ని వి.సంధ్య, రత్నమాల, పశ్య పద్మిని, కృష్ణ, ప్రేమ్‌పావని లాంటివారితో కలిసి సమర్పించాం. దానికి సమాధానంగా గవర్నరు "నేను మీకూ నా సహకారాన్ని అందిస్తాన"ని చెప్పారు.

నవంబరు 9, 2003న ఐక్య వేదిక తరుపున జరిగిన రాష్ట్ర సదస్సులో జెలాన్ బాను, పొత్తూరి వెంకటేశ్వరరావు, టంకశాల అశోక్, వి.రవి ప్రకాశ్, వి.సంధ్య, రత్నమాల, పి. రామచంద్రయ్య, జ్యోతి లాంటి వారితో జరిగింది. వారి అభిప్రాయాలు - మద్యం నేడు రాష్ట్రంలో స్వైర విహారం చేస్తోంది. అల్పాదాయ కుటుంబాలు ఛిన్నాభిన్నామౌతున్నాయి. ప్రజలు జీవితాలతో ఆడుకుంటూ డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం, అవినీతిలో కూరుకుపోయిన ఎక్సైజ్ పోలీసుశాఖల ద్వారా రాజకీయ నాయకులు లాభిస్తున్నారు. సమాజం సర్వనాశనం అవుతోంది. అదుపులేని త్రాగుడు వ్యక్తి ఆరోగ్యం మీద తీవ్ర అనారోగ్య నష్టాన్ని కలిగిస్తోంది. కాలే కడుపుల్లోకి మద్యం నింపడంచేత మనిషి జీర్ణవ్యవస్థ, గుండె, మెదడు, నాడిలాంటి భాగాలన్ని చెడిపోయిన స్థితిలో రోగ నిరోధక శక్తి తగ్గి పోతుంది. మనిషి హీన దశకు చేరి బలహీనడవుతున్నాడు. బాధ్యతారాహిత్యం పెరుగుతుంది. శారీరక శ్రమ చేసే సామర్థ్యం తగ్గిపోయి మద్యం వ్యసనం పెరిగి ఆత్మాహుతులవుతున్నారు. సంపాదనను త్రాగుడుకి తగలేశావని భార్య అంటే ఆమెపై నచేయిచేసుకోవడం లాంటి బాధలను అనుభవించే పరిస్థితిని కల్పిస్తున్నది ప్రభుత్వమే కదా! ఆ సభవారు కొన్ని డిమాండ్లను ప్రతిపాదించారు. అన్ని ఆరోగ్య కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వమే డి-ఎడిక్షన్ సెంటర్లను నిర్వహించాలి. గత మద్య నిషేధ ఉద్యమ సంధ్భరంగా ఇంకా 1500 మంది కార్యకర్తలపై వున్న కేసులను వెంటనే ఎత్తివెయ్యాలి. మేము చేస్తున్న అలజడి, అందోళనపై నిర్బంధాలను ప్రయోగించకూడదు. ప్రజాస్వామికవాదులు, మేధావులు మద్య వ్యతిరేక కార్యక్రమాలకు మద్దతునివ్వాల్సిందిగా మేము విజ్ఞప్తి చేశాం. ఇంకా చెప్పాలంటే ప్రతి లిక్కరుషాపు పరిధిలో డి- ఎడిక్షన్ కేంద్రాలు పెట్టాలి. అధికారులు త్రాగినా, మద్యం వ్యాపారులకి సహకరించినా వారిని సస్పెండు చేసేలా చట్టం చెయ్యాలి. ఏ సభ జరిగినా మద్యపానాన్ని వ్యతిరేకిస్తూ ఉపన్యసించాలి. త్రాగడం, అరాచకం, ఆటవికం, ఆనాగకరికం అనేది నిజం. రాజ్యాంగ విరుద్ధ వ్యాపారానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం. ఇవిఈ సభ నినాదాలు.

తరతరాలుగా, యుగయుగలాగా దేశదేశాలలో ఏదో ఒక రకమైన త్రాగుడుకు అలవాటు పడ్డ ప్రజలు కోట్ల సంఖ్యలో వున్నారు. "మీరెంత మీ సంఖ్యాబలమెంత. మీరు త్రాగే మమ్మల్ని ఆపగలరా! మీకు

ఇదొక అనవసర ప్రయాస! మీరు నెగ్గలేరు! మాపాటికి మేము, మీ పాటికి మీరూ మనగలడం ఉత్తమం! శుష్కప్రియాలు, అనవసర ఘోషలు చెయ్యకుండా మీ బ్రతుకు మీరూ చూసుకోండని ఎత్తిపొడిచేవారు. ఆ సంఖ్యాకులు వున్నారు. కాని ఏ చిన్న పని, చెయ్యాలన్న మొదట ఒక్కడి బ్రెయిన్‌లో పుట్టి అది విస్తరించి శాఖోపశాఖలుగా మహోద్యమవుతుందని తార్కాణాలు చాలా వున్నాయి. సిద్ధాంతాలు మంచివయితే, ఎంతటి కఠిన ఆచారాలయినా సంస్కరించగలమనే దానికి కావల్సినన్ని తార్కాణాలున్నాయి. సూర్యుడు ఉదయించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గాంధి లాంటి మేధావులతో మనందరం చేతులు కలిపి మనదేశాన్ని రక్షించుకున్నాం. అలాగే బాల్య వివాహ నిషేధం, వరకట్న నిషేధం, పడపువృత్తి పై అంక్షలు, వెట్టిచాకిరి నిర్మూలన, ఆర్థిక పీడనపై పరిమితులు, స్త్రీలను అసభ్యంగా చిత్రించి అవమానించడం, అస్పృశ్యతా నివారణ వీటన్నింటిని అంతమొదించి విజయాలను సాధించలేదా! నల్లమందు, మాదక ద్రవ్యాల సంఘ సంపద సరఫరా, వినియోగాలను ప్రపంచం మొత్తం నిషేధించింది కదా! ప్రజలు మౌలిక హక్కుల పేర వీటిని వ్యతిరేకించ లేదా! మద్యపాన నిషేధ శాసనాన్ని అమలు పరచలేమని దానిని వ్యతిరేకిస్తామా? ఇప్పటికి బాల్య వివాహాలు జరుగుతున్నాయి. పడుపు వృత్తి, విచ్చలవిడిగా సాగుతున్నది. స్త్రీలపై అత్యాచారాలు ఎక్కువవుతున్నాయి వరకట్నాల జోరు తగ్గలేదు. అస్పృశ్యత పూర్తిగా పోలేదు. దళితుల పట్ల నిరసన కన్పిస్తూనే వుంది. అలాగని ఈ సిద్ధాంతాలను రద్దు చేస్తామా! ఆ దృష్టితో సారా నిషేదాన్ని అమలుపరచడంలో సామాజికభ్యుదయవాదులు ప్రముఖ పాత్ర వహించక తప్పదు. 47వ రాజ్యాంగంలో ప్రజల ఆరోగ్యానికి, జీవన ప్రమాణానికి మద్యపాన నిషేధాన్ని అమలు పర్చాలని 54 ఏళ్ళనాడు వ్రాస్తుకున్నాం. అయినా తమ సౌలభ్యమేకాని ప్రజల సంక్షేమాన్ని ఆలోచించడంలేదు ప్రభుత్వం.

నవంబరు 30, 2003 న ఉదయం 10 గంటల నుండి 12 గం. వరకు గొప్ప ప్రదర్శన జరిగింది. మద్యం వ్యతిరేక ఐక్య వేదిక ట్యాంక్ బండ్ మీద 'మద్య నిషేధం' మానవ హారం అన్ని మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు, ఉద్యమకారులు, మద్య వ్యతిరేక ఐక్య వేదిక కార్యకర్తలం ప్లే కార్డులు, బ్యానర్లు పట్టుకొని 200 మందిమి ప్రదర్శన జరిపాము.

ఈ నేపధ్యంలో ప్రస్తుతం ప్రజల కర్తవ్యమేమిటి ? ప్రభుత్వ బాధ్యత ఏమిటి? అని ఆలోచిస్తే, మహిళోద్యమ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు వ్యక్తిగానో సమిష్టిగానో కార్యచరణకు పూనుకోవడం, ఉద్యమ నినాదాన్ని హైలేట్ చెయ్యడం మొదటి కృషి. ఇందులో రాజకీయాలు, కులమతాలు, హెచ్చుతగ్గులు, అంతస్థులు చోటుచేసుకోరాదు. ఎలాగు అందరం సాంఘిక దురన్యాయాన్ని హతమార్చటానికి ఉద్యమంలోకి వచ్చాం కనుక దాని విషయంలో విభేదాలు వుండరాదు, ఏదో ఒక మద్యం ఏదో ఒక ప్రాంతంలో నిషేదిస్తే, తృప్తి పడరాదు, ఇది మన సమస్య, మన రాష్ట్ర సమస్య కనుక దీనిని సాధించటానికి సర్వశక్తులు ఉపయోగించి చరిత్రలో ఆంధ్ర స్త్రీలకు గౌరవ ఔన్నత్యాలను సాధిద్దామని కంకణం కట్టుకోవాలి. మనం కలిస్తే కొండని పిండి చెయ్యగలం. అపూర్వమైన, అతి కష్టమైన స్వరాజ్యాన్ని శాంతి అహింసలతో సాధించగలిగాం. అది నిన్నమొన్నటి చరిత్ర. ప్రజలు అశేష త్యాగాలు చేసి, హోరాహోరి పోరాడి నిషేధాన్ని అమలు పర్చడమే ప్రస్తుత మన కర్తవ్యం. ముఖ్యంగా ప్రజల్లో సామాజిక చైతాన్యాన్ని కలిగించాలి. విష పరిణామాలను వివరించడానికి సభలు, సమావేశాలు, చర్చాగోష్టులు, వీధి నాటకాలు, ప్రహసనాలు, విద్యుత్ గోష్టులు నిర్వహించాలి. ప్రభుత్వోద్యోగులు ఏ నిబంధలకు లొంగరు. వారిలో కూడా ఈ వ్యసనాన్ని మాన్పించటానికి మనం, మన కార్యకర్తలు ప్రభుత్వంపై వత్తిడి తేవాలి. ఉన్నతోన్నత పదవుల్లో వున్నవారిలో మార్పు కలగటానికి వారి జీవిత వివరాలు ప్రజలకు తెలియజెప్పాలి. అలాగే ప్రభుత్వపరంగా కొన్ని విధులు పాటించక తప్పదు. బార్లు, క్లబ్బులు, షాపుల్లో త్రాగాడాన్ని నిషేదించాలి. ముఖ్యంగా ప్రభుత్వోద్యోగులు, ఎం. ఎల్.ఏ.లు మినిష్టర్లు ఎవరి పరిధిలో వారు త్రాగుడు మాని ప్రజలకు ఆదర్శప్రాయులు కావాలి. రాజకీయ పార్టీలవారు తమతమ ఎన్నికల ప్రణాళికలో ఎన్.టి.ఆర్.లాగా ' మేము అధికారంలోకి రాగానే ముందు మద్య నిషేదాన్ని, అమలుపరుస్తామని వ్రాయాలి. అంతేకాదు ఆ మాటను నిలబెట్టుకొని ఎం. ఎల్.ఏలను, ఎంపిలను గద్దె దించాలి. త్రాగుబోతులు ఎన్నికయితే ఆ పదవులకు అనర్హులని ప్రకటించాలి. వారిని సస్పెండు చేయాలి. త్రాగుబోతులకు డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చెయ్యాలి. ప్రజలకు మత్తు పదార్థాల నుండి విమోచనను కలిగించాలి. మద్యనిషేధ కమిటీ తరఫున కాంగ్రెస్ ప్రెసిడెంటు శ్రీనివాసరెడ్డికి, బిజెపి ప్రెసిడెంటు

ఇంద్రసేనారెడ్డికి, తెలంగాణా పోరాటసమితి ప్రెసిటెండు చంద్రశేఖరరరెడ్డికి తమ తమ ఎలక్షన్ల మ్యానిఫెస్టోలో మద్యనిషేధాన్ని అమలుపరుస్తామని వ్రాయమని, వారికే మేము ఓటు వేస్తామని చెప్పాము.

ఈ సందర్భంగా సామాజిక శాస్త్రవేత్తల, మానసిక తత్త్వవేత్తల, ఆర్థిక తత్త్వవేత్తల పరిశోధనలో తేలిన కొన్ని ముఖ్యాంశాలు చర్చించక తప్పదు. మద్య వినియోగం వల్ల వచ్చే అనారోగ్యాలు, వైద్యం కొరకు ప్రజలు సంవత్సరానికి 2,500 కోట్లు వెచ్చిస్తున్నారని, మద్యం త్రాగడానికి 20,000 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని ఆర్థిక నిపుణులు వెల్లడించారు. మద్యపానం వల్ల ప్రతి ఏటా సుమారు 4 కోట్ల పనిదినాలను కోల్పోవడం జరుగుతోంది. 2 లక్షల మంది అకాల మృత్యువద పడుతున్నారు. మద్యపానం వల్ల 20 వేల కోట్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దుర్వ్యసనం వల్ల సంవత్సరానికి దాదాపు 2 లక్షల దాంపత్యాలు సర్వనాశనమవుతున్నాయి. ఇందువల్ల ఇతర సామాజిక రుగ్మతలు అంటే లంచగొండితనం, నేరప్రవృత్తి, వ్యభిచారం, దొంగతనాలు, హత్యలు, ఆత్మహత్యలు వేల సంఖ్యలో పెచ్చు పెరుగుతున్నాయి. కుటుంబ ఆదాయం కూలిపోతున్నది. ప్రతి త్రాగే కుటుంబంలో పిల్లలు కూడా ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు. బొత్తిగా దొక్కాడనివారి జీవితాలు మరింతగా సర్వనాశనమవుతున్నాయి. ప్రతి సంవత్సరం మరో 5 లక్షలమంది అదనంగా వ్యసనపరులు కలుస్తున్నారని లెక్కలొచ్చాయి. ఈ దురలవాట్లను ఎలా నిర్మూలించాలనేదొక పెద్ద సమస్యగా తయారయింది. ఈనాడు ప్రతి త్రాగుబోతు బీద, మధ్య, ధనిక వర్గ ప్రజలు "ఇదొక ఫ్యాషన్‌గా భావించి.... ఏం త్రాగితే తప్పా? మా డబ్బుతో మేం త్రాగుతున్నాం. ఇది మా ఇష్టం. మీరెవరు మమ్మల్ని శాసించటానికి" అని మీదిమీది కొస్తున్నారు. త్రాగే హక్కు మౌలికహక్కని వాదించేవారూ ఉన్నారు. నిజానికి మౌలిక హక్కులు నిర్బంధమైన హక్కులు కావు. మత్తుపదార్థాల వాడకంతో మనిషిలోని శక్తి నశిస్తుంది. మనిషిలోని ఇంగితజ్ఞానం కోల్పోయి హుందాకు, హోదాకు అశనిఘాతం ఏర్పడుతుంది. ఈనాడు స్త్రీల, పిల్లల ఆరోగ్యాన్ని, కుటుంబ సంక్షేమాన్ని హింసల నుండి విముక్తికి, హుందాతనాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించటానికి మద్యనిషేధం అత్యవసరం.

మద్యం కేవలం కుటుంబ సమస్య మాత్రమే కాదు. ఇది సామాజిక, ఆర్థికపరమైన సమస్య కాదు. విలువలు, శాంతిభద్రతల సమస్య కూడా. ప్రభుత్వ ప్రజల్ని మద్యానికి బానిసల్ని చేస్తుంటే బార్ అండ్ రెస్టారెంట్లలో అర్ధనగ్న దృశ్యాలు, అశ్లీల పోస్టర్లు, సెక్సు డాన్సులు పెచ్చుపెరిగిపోతున్నాయి. ప్రభుత్వం షాపులను, లైసెన్సులను పెంచి ధనార్జన చేస్తోంది. పైగా ఇన్ని వేల లీటర్లు అమ్మాలని టార్గెట్లను పెట్టి లైసెన్సు డబ్బును లక్షల్లో పెంచింది. ఈ పరిణామంలో పెద్దషాపులవారు బెల్టుషాపులను పెట్టి వారి ద్వారా విక్రయాలను పెంచి బెల్టు షాపులను విస్తృతపరిచారు. ఈనాడు రాష్ట్రంలో లక్షల సంఖ్యలో బెల్టుషాపులున్నాయని లెక్కలొచ్చాయి. మనిషి ఎటుపోయినా ఎక్కడికివెళ్ళినా మద్యం దర్శనమిస్తోంది. ప్రతి కిళ్లీ షాపులో ప్రత్యక్షమౌతోంది. ప్రతి కూలీ, మధ్యతరగతి వారు దారిలో త్రాగి ఇంటికొస్తున్నారు. అంతేకాదు ఈనాడు 7,500 మద్యంషాపులు వున్నాయి. ప్రభుత్వం తమ ఖజానా ఖాళీ అవుతుందనే భయంతో మద్యం అమ్మకాలని ప్రోత్సహిస్తోంది. పల్లెలను స్మశానంగా చేసింది. ఇళ్లను శోకసముద్రంలో ముంచింది. కనుక మహిళలందరూ ఏకమై మరోసారి పోరాటానికి సన్నద్ధమై విద్యార్థులు, యువజనులు, రైతులు, కూలీలు, మేధావులు, ప్రజాస్వామికవాదులంతా కలిసి మద్యం ఉత్పత్తులను నిలిపివేయాలి. లిక్కర్ లైసెన్సులను రద్దుచెయ్యాలి. కల్తీ మద్యం త్రాగి మరణించిన వారికి ప్రభుత్వం కనీసం నాలుగు లక్షలు నష్టపరిహారాన్ని చెల్లించాలి. ముందుగా బెల్టుషాపులను రద్దు చెయ్యాలి. ఉద్యమకార్యకర్తలు ప్రతిరోజు వంతులవారీగా ముఖ్యమంత్రికి మన డిమాండ్లను తెలుపుతూ పోస్టు కార్డులను వ్రాయాలి. మన డిమాండ్లనన్నింటిని పోస్టర్లుగాను, స్టిక్కర్లుగాను అంటించాలి. విక్రయ కేంద్రాలలో మద్యం అమ్మకాలను వ్యతిరేకించాలి. ఇది ఏ ఒక్కరి సమస్య కాదు. ప్రజలందరం ఏకత్రాటిగా నిలిచి మనకోసం, మన కుటుంబం, రాష్ట్రం, దేశాల కొరకు, సమాజం కొరకు మద్యనిషేధాన్ని అమలుపర్చాలి.

"దేశంతో జన్మతః ఎలాంటి సంబంధంలేని సోనియా ఇక్కడి సమస్యలను ఎలా అర్థం చేసుకొంటుంది? ముఖ్యమంత్రి

– జన్మతః సంబంధం ప్రపంచబ్యాంకుకు ఉంది కాబోలు ఆంధ్రప్రదేశ్ సమస్యలు అర్థం చేసుకోవడానికి

"ఇండోనేషియాలో భూకంపం, ఏడుగురికి గాయాలు" వార్త

– భారతదేశంలో జరగబోతున్న భూకంపం (ఎన్నికలు) ఇరానీ స్థాయిలో వుంటుందా, ఇండోనేషియా స్థాయిలో వుంటుందా అనేది తేలాల్సిన విషయం

"బస్సులోనే 'దేశం'నేత హత్య" వార్త

– అందుకనేనా కాంగ్రెస్ బస్‌యాత్ర చాలించి, చిన్న వాహనంలో యాత్రను కొనసాగిస్తున్నారు?

"చేనేత కార్మికుడు ఆకలి చావు" వార్త

– ఇదో కొత్తవార్తా ఏమిటి? చంద్రబాబు ఉపన్యాసంలో ఊతపదాలంత మామూలయిపోయాయి

"జూనియర్ డాక్టర్ల అర్ధనగ్న ప్రదర్శన"

– అర్ధనగ్నమైనా, నగ్నమైనా ప్రభుత్వానికి సిగ్గేలేకపోతే నిరసన ప్రదర్శనలతో వచ్చే ప్రయోజనం ఏముంటుంది?

"మున్నీ విగ్రహం ప్రతిష్టిస్తానన్న వాగ్దానాన్ని ముఖ్యమంత్రి నిలబెట్టుకోలేదు" ఆంధ్రజ్యోతి పాఠకుడు

– అక్కడికి చేసిన ఇతర వాగ్దానాలను నిలబెట్టుకున్నట్లు!

"పాకిస్తాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్‌కు సమఉజ్జీ కాదు, ప్రత్యర్థి కాలేదు" అమెరికాలో రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్ అన్వర్ సయీద్

– ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీకి సమఉజ్జీ కాలేదుగా! (ఊహలో చంద్రబాబు ఉవాచ)

"చలిలో వణుకుతున్న ఉత్తరాది" వార్త

– ఎన్నికల జ్వరంతో కాలిపోతున్న పార్టీలు

"మినీబస్ అంతా ఖాళీ" వార్త

– సభజరిగే చోటంతా ఫుల్!

"పాత్రికేయుల మైండ్‌సెట్ మారాలి" ముఖ్యమంత్రి

– తనొక్కడి మైండ్‌సెట్ మార్చుకుంటే ఇంక ఇతరుల మైండ్‌సెట్ మార్చాల్సిన శ్రమే అక్కరలేదు.

"అధికారంకోసం రాష్ట్రాన్ని అమ్మేందుకైనా కాంగ్రెస్ సిద్ధం" తలసాని

– అమ్మకానికి ఏమైనా మిగిలిస్తేగా మీ నాయకుడు, రాష్ట్రాన్ని ఆయన ఎపుడో అమ్మేశారు కదా!

"వారిది పచ్చనోటు, మనది నోటిమాట" –చంద్రబాబు

– బాబూ, అటుదిటు తిప్పి చదువుకొంటే వాస్తవానికి దగ్గరగా వుంటుంది.

"వాజ్‌పేయిపై బుష్ ప్రశంసల జల్లు" అమెరికా విదేశాంగమంత్రితో కలిసి విలేఖరుల సమావేశంలో భారత విదేశాంగ ప్రతినిధి సిన్హా – వార్తలు

– ఎక్కడికి పోతున్నాం

"కాంగ్రెస్ నేతలు ఆత్మగౌరవం తాకట్టు" ముఖ్యమంత్రి

– గురివింద గింజ తనకింద నలుపు తానెరుగదట

"యుద్ధానికి నాకెవరి అనుమతి అవసరం లేదు" బుష్

– ఈయనతో మాట్లాడదానికేనా భారత విదేశాంగమంత్రి సిన్హా పరుగులు తీసుకుంటూ వెళ్లింది?

"గత అర్ధదశాబ్దంలో నాలుగేళ్లు వరుసగా దుర్భిక్షమే" ఈనాడు వార్త

– కొంతమంది కాలుపెట్టిన వేళావిశేషం అలాంటిది

"ఈ ఎన్నికల్లో జరగకూడనిది జరిగితే రాష్ట్రానికే నష్టం"

– కరెక్ట్. ప్రజలంతా కోరుకుంటున్నదీ అదే

"ముందస్తు ఎన్నికలకు విలువ కల్పిస్తూ లోక్‌సభ రద్దు" వార్త

– లోక్‌సభ రద్దుతో ఎన్.డి.ఎ. ప్రభుత్వం శాశ్వత రద్దుకు సంకేతం కాబోదు కదా!

"ఈ ఎన్నికల్లో జరగకూడనిది జరిగితే రాష్ట్రానికే నష్టం" –చంద్రబాబు

– కరెక్ట్. ప్రజలంతా కోరుకుంటున్నది కూడా అదే.

అధికారం కోసం మతంపేరిట జరిగిన హత్యలూ, రైతాంగం ఆత్మహత్యలూ, వ్యవసాయకూలీల ఆకలిచావులనూ ఫీల్‌గుడ్ అని అనుకోగలమా?

– బుద్ధదేవ్ భట్టాచార్య (పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి)

ఎన్.డి.ఎ. అజెండాలో రామాలయం నిర్మించే అంశం తేనప్పుడు ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయలేకపోయాం అనే ప్రశ్న ఎందుకు తలెత్తుతుంది?

– కపిల్ సిబాల్

ఆకాశంలోని తారలను, ఎడారిలోని ఇసుక రేణువులను లెక్కపెట్టవచ్చునేమో కాని మన దేశంలో ఉన్న రాజకీయ పార్టీలను లెక్కించడం దేవతలకే కాదు, రాక్షసులవల్లా కాదు.

– అబ్దుల్ కలాం

లోక్‌సభను ముందుగా రద్దు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం ప్రజాసంక్షేమానికి హానికరం. ఇది కేవలం పార్టీ ప్రయోజనాల కోసమే చేసిన చర్య

– కేంద్ర న్యాయశాఖ మాజీమంత్రి రాంజెత్మలానీ

సభలో మెజారిటీ ఉన్న ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి తాను పరిపాలించకుండా ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకాకుండా సభను రద్దు చేయాలని పట్టడం అప్రజాస్వామికం అంటూ రాజ్యాంగాన్ని సవరించాలి

– ఆంధ్రజ్యోతి ఎడిటోరియల్

అధికారంలోకి వస్తే ఉచిత విద్యతోపాటు విద్యుత్ బకాయిలను మాఫీ చేస్తాం

– వైఎస్

దేశభక్తి, స్వదేశీ నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి దేశాన్ని బజారులో పెట్టి అంగాంగాలను అమ్మేస్తుంది.

– ఎ.బి.బర్ధన్ (సిపిఐ ప్రధాన కార్యదర్శి)

రాష్ట్రంలో ఉన్న నక్సలైట్ల సమస్యకు కేవలం సాయుధ బలగాలతోనేకాక అభివృద్ధి కార్యక్రమాలతోనూ పరిష్కరించుకోవచ్చు.

– ప్రకాశ్‌సింగ్ (అలిపిరి విచారణ అధికారి, ఉత్తరప్రదేశ్ మాజీ డిజిపి)

గిరిజనులు ఇతర మతంలోకి మారినా వారికి ఉన్న షెడ్యూల్డ్ తెగ హోదా కోల్పోరు.

– సుప్రీంకోర్టు

పన్ను చెల్లింపుదారుల ధనాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం మంచిది కాదు

– ప్రధాన ఎన్నికల అధికారి టి.ఎస్. కృష్ణమూర్తి

దేశంలోని 276 ప్రభుత్వరంగ సంస్థల్లో 139 సంస్థలు లాభాల్లో నడుస్తుండగా, 125 కంపెనీలు నష్టాల్లో ఉన్నాయి. లాభాలు ఆర్జిస్తున్న 45 కంపెనీలే మొత్తం లాభంలో 86% వాటాను కలిగి ఉండగా, మొత్తం లాభాల కంపెనీల లాభాలు 33.506 కోట్లు. నష్టాల్లో ఉన్న 125 కంపెనీల్లో 95 కంపెనీలు తమ పెట్టుబడుల కంటే అనేక రెట్లు నష్టాల్లో ఉన్నాయి. మొత్తం నష్టాల్లో నడుస్తున్న కంపెనీల్లో నష్టాల విలువ 68.150 కోట్లు.

– కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)

(7వ పేజీ తరువాయి)

<u>విశాఖపట్నమా... రిస్కీపట్నమా?</u>

నివేదికలను బహిర్గతం చేయాలి.

3. ప్రమాదకరమైన పదార్థాలను నిల్వచేసే విషయంలో మనదేశానికి అనుగుణమైన భద్రత ప్రమాణాలను నిర్ధారించాలి.
4. ప్రతి ఇండస్ట్రీ తన యొక్క ప్రమాదకర కార్యకలపాల వివరాలు బహిరంగంగా వెల్లడి చేయాలి.
5. అవి విడుదల చేసే వ్యర్థపదార్థాల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యాలకు కలిగే హానిని తెలియజేసే సర్వే జరిపించాలి.
6. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారిచే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యవేక్షణలో ఒక మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి ఏదైనా బ్యాంక్‌లో 10 కోట్లరూపాయల డిపాజిట్‌ను హామీగా చూపించాలి.

○

బిసిల బతుకులు బలితీసుకుంటున్న ప్రపంచీకరణ

- కాలువ మల్లయ్య

పారిశ్రామికీకరణ జరిగినప్పుడు బిసిలు అప్పటివరకూ ఆధారపడి ఉన్న వృత్తులపై జరిగిన విధ్వంసం కంటే ఎన్నోరెట్లు ఎక్కువ విధ్వంసం ప్రపంచీకరణ వల్ల జరుగుతోంది. దీనిని గ్రహించి జాగ్రత్తపడడంలోనే బిసిల భవిష్యత్తు ఉంది. ప్రపంచీకరణను సమర్థించే బిసి మేధావులు పరిస్థితి తీవ్రతను గుర్తిస్తే మంచిది.

సంపన్న అగ్రవర్ణ కులాలవాళ్ళు... విశ్రాంతి కుల సంస్కృతిని సమర్థించే అగ్రవర్ణ మనస్తత్వం కలవాళ్ళు... సామ్రాజ్యవాద సంస్కృతిని ఆహ్వానించేవాళ్ళు... ప్రపంచ బ్యాంకు ఏజెంట్లు గ్లోబలైజేషన్ ముద్దు చాలా తీయగా ఉందనడంలో వింతలేదు. ఎందుకంటే వాళ్ళ శరీరాల నిండా చక్కరే ఉంది కాబట్టి ప్రపంచీకరణలోని కటిక చేదు కూడా వాళ్లకు తీపిగానే అనిపిస్తుంది. కాని బిసి మేధావులమని, నాయకులమని, ఉద్యమాలవీ చేస్తున్నామంటున్న వాళ్ళు, 'గ్లోబలి' బిసిలకు మేలు చేస్తుందని ఉపన్యాసాలు దంచుతున్నారు. గ్లోబలైజేషన్ ఏం మేలు చేసింది? ఎలా ఉపయోగపడింది? దీన్ని ఆహ్వానించాల్సిన అవసరం బీసిలకేముంది? అన్నవి మరిచిపోయి ప్రపంచీకరణ బీసీలకు మేలు చేస్తుందని సెలవివ్వడం బీసీలను తప్పుదారి పట్టించడమే.

బీసీల బతుకంతా వృత్తుల్లోనే ఉంది. అన్నిరకాల సంపదలను సృష్టించే తమ పని నైపుణ్యంలోనే ఉంది. ఆహారధాన్యాలు, బట్టలు, గృహనిర్మాణ సామాన్లు, ఇటుక, గూనపెంకులు, నగలు చేయడం, బండలను పిండిచేసే కాశెపని, వడ్రంగం, కమ్మరులాంటి వృత్తులు, గొర్రెల పెంపకం, పశువుల పెంపకం, జాలరి వృత్తిచేసేది బీసీలే. సమస్త జానపద కళలను రక్షించేవాళ్ళు, పూసలమ్మేవాళ్ళు, గౌడవృత్తివాళ్లు, మేదర పనివాళ్ళు, విస్తరాకులేసేవాళ్ళు ఇవన్నీ బీసీలకు బతుకుదెరువును చూపే ఆదాయమార్గాలు. ఈ పనులన్నీ చేతినిండుగా ఉంటే బీసీల ఆదాయానికి, బతుకుదెరువుకు ఢోకాలేదు.

ప్రయాణ సౌకర్యాల పెంపు, పారిశ్రామికీకరణతో బీసీలు చాలా వృత్తులు మూలబడ్డాయి. సాలెల మగ్గం తుప్పుపట్టింది. కుమ్మరి సారె విరిగిపోయింది. పల్లకి మూలబడింది. సాలీలు నేడు దిక్కులేని వాళ్ళయ్యారు. మిషన్లొచ్చి కంసాలీల సుత్తెల నాదానికి భంగం కలిగించాయి. గొర్రెలు తిరగడానికి చోటులేకుండా పోయింది. వృత్తులు కోల్పోయిన కులాల్లో కొందరు తప్ప చాలామంది సంక్షోభంలోకి నెట్టబడ్డారు. బీసీలు తమ వృత్తి జీవన మార్గాలన్నీ మూసుకుపోతుంటే నిస్సహాయంగా నిల్చున్నారు. పనే వృత్తిగా ఉండే బీసీ కులాల వారి చేతుల్లో దేశవసరాల కవసరమయ్యే వస్తూత్పత్తి చేసే వృత్తులున్నప్పుడు ప్రకృతిసిద్ధమైన వనరులలాగే ఉండేది. ప్రకృతి వికృతిలా ఉండేది. లాభాపేక్షలేని వ్యవసాయాలుండేవి. సమతుల్య వాతావరణమూ, వ్యవసాయమూ ఉండేవి. పారిశ్రామిక విప్లవం వీటన్నింటికీ విఘాతం కలిగించి వృత్తిపనివాళ్ళ నడ్డి విరిచింది.

వృత్తులను కాపాడుకోవడమంటే చదువూ సంధ్యలు లేకుండా కేవలం వృత్తిపనులు చూసుకుంటూ బతకడం మాత్రమే కాదు. ఉన్న అవకాశాలనుపయోగించుకొని రచయితలుగా, ప్రొఫెసర్లుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే ప్రజానాయకులుగా, రాజ్యాధికారానికి అవసరమయ్యే సిద్ధాంతాలనందించే తాత్వికులుగా కూడా ఎదగడం. ఈ అవకాశాన్ని వదిలిపెట్టకుండా రకరకాలుగా ఎదుగుతూనే తమకు ఆదాయమార్గాలయిన వృత్తులను కొనసాగించడం, ఎందుకంటే ఇంట్లో ఉన్నా వాళ్ళంతా ఇలా ఎదగడం సాధ్యంకాకపోవచ్చు.

పారిశ్రామికీకరణ పేరుమీద, యంత్రాల మోజుతో కొన్ని వృత్తులు కష్టంలేనివిగా లేదా కష్టం తక్కువైన పనులుగా మారిన తర్వాత ఆ పనులతో సంబంధం లేనివాళ్ళు వాళ్ళు ఆయా పనులకు లేదా వృత్తులకు యజమానులయ్యారు. వస్త్రపరిశ్రమ పెట్టుబడిదారుల చేతుల్లోకి, పాడిపరిశ్రమ బర్రెపేడ ముట్టనివాళ్ళ హస్తగతమైనాయి. ప్లాస్టిక్ వచ్చి కుమ్మరి వృత్తిని మాయం చేసింది. కోతయంత్రాలు, తూర్పారబట్టే యంత్రాలొచ్చి కూలీల నోళ్లలో మన్నుగొట్టాయి. ఫాములొచ్చి గొల్లల వృత్తిని దెబ్బతీశాయి. డ్రైక్లీనింగ్ సెంటర్లు చాకలివాళ్ళకు విఘాతం కలిగించాయి. యంత్రాలవల్ల వృత్తి వ్యాపార సరుకుగా మారిపోయి ఆ పనంటే ఏమిటో తెలియనివాళ్ళు యజమానులై కూర్చున్నారు. బీసీలను కూలీలుగా తయారుచేశారు. పారిశ్రామికీకరణ ప్రభావమే వ్యాపారపంటలు. ఆంధ్రప్రదేశ్ పాలపరిశ్రమ అగ్రకులాలవారి చేతుల్లోకిపోయి అంతకుముందు వృత్తిపని చేసేవారంతా పెంట తీసేవాళ్ళుగా, పాలుపిండే కూలీలుగా మారారు. ఊళ్ళలో కల్లుగీత పరిశ్రమొక్కటి గౌండ్లవాళ్ళ చేతుల్లో ఉన్నప్పటికీ కోట్లాది రూపాయల ఆదాయాన్నిచ్చే సారా కాంట్రాక్టుల, వైన్ వ్యాపారులు, బార్లన్నీ అగ్రకులాల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. వస్త్రాలు పరిశ్రమగా మారిన తరువాత దానివల్ల లాభపడ్డ పద్మశాలీలు తక్కువ. నేతపనితో సంబంధం లేనివాళ్ళే కోట్లు సంపాదించారు. కళలు కూడా వ్యాపార సరుకై సినిమా

పరిశ్రమ వచ్చిన తరువాత అద్భుత కళానైపుణ్యం ఉన్న బీసీ కులాల కళాకారులంతా వీధినపడ్డారు. తోలుబొమ్మలాడించే ఆరెవాళ్ళు, అద్భుతంగా కథలు చెప్పే ముదెచ్చులవాళ్లు, ఒగ్గువాళ్లు, కొమ్మువాళ్లు, బుర్రకథలు చెప్పే శారదాకలు, ఇలా అన్ని వృత్తుల వాళ్ళూ సంక్షోభంలోకి నెట్టబడ్డారు. పరిశ్రమల్లో కార్మికులుగా, కూలీలుగా, కొందరు దూరప్రాంతాలకు వలసపోయి బతుకుతున్నారు. మరికొందరు రిక్షాకార్మికులుగా జీవనం వెళ్ళబోసుకుంటున్నారు. గ్రామాల్లో చాలామంది వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. భారతదేశం ప్రధానంగా వ్యవసాయదేశం కాబట్టి ఈ వృత్తి ఆధారంగా బతికేవాళ్ళసంఖ్యే ఎక్కువ.

వివిధ ఉద్యమాలు, కొన్ని అనివార్య సామాజిక పరిణామా వల్ల వృత్తులు నశించి సంక్షోభం ఏర్పడడం వల్ల, అగ్రవర్ణాలవారు మరింత లాభసాటియైన పారిశ్రామికరంగాన్ని ఎన్నుకోవడం వల్ల కొన్ని భూములు దళిత, బహుజనుల చేతుల్లోకి పోయాయి. ఈ విషయమే అగ్రవర్ణ భావజాల పాలకవర్గాలకు కంటగింపయింది. అందుకే వాళ్ళు ప్రపంచీకరణ పేరుమీద జరుగుతున్న విధ్వంసాన్ని హృదయానికి హత్తుకుంటున్నారు. పూలతో స్వాగతం పలుకుతున్నారు. ఇందులో ఉన్న మొదటి దుర్మార్గం పోటీ, వ్యాపారం, ఇక్కడి వ్యవసాయదారుడు విదేశీ వ్యవసాయదారుడితో పోటీ పడాలట. నాణ్యత విదేశీ పంటల్లా ఉండాలట. అదెలా సాధ్యం? మరక్కడున్న భూముల నాణ్యతా, నీటి సరఫరా ఇక్కడున్నాయా? వాళ్లిస్తున్న సబ్సిడీలు ఇక్కడిస్తున్నారా? పోటీ అనేమాటలోనే అమానుషత్వముంది. వ్యవసాయంలో పోటీ ఏంటి? వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చడంలోనే అమానవీయతుంది. నాణ్యతగల వ్యవసాయం పేరుమీద కార్పొరేట్ వ్యవసాయాలను ప్రోత్సహించడం, చిన్నచిన్న వ్యవసాయదారులుగా ఉన్న బీసీ, ఎస్సీ కులాల వాళ్ళందర్నీ అగ్రకుల భూస్వాముల వద్ద పాలేర్లుగా, కూలీలుగా మార్చడమే. ఇలా దేశీయ వ్యవసాయాన్ని, పనిసంస్కృతిని నమ్ముకొని బతుకుతున్నవాళ్ళను మరింత సంక్షోభంలోకి నెట్టడమే గ్లోబలైజేషన్. గ్లోబలైజేషన్ అంటేనే గ్లోబును బలితీసుకోవడం, గ్లోబులోని బలహీనవర్గాలను, జాతులను బలిచేయడం.

గ్లోబలైజేషన్ వలన అవకాశాలున్న ఉన్నత కులాల వాళ్ళు విదేశాలకెళ్లిపోతున్నారు. విశ్రాంతి కులాలవారు ఇష్టమున్నంత సంపాదించుకోవడానికి మార్గం సుగమం చేస్తుంది. తత్ఫలితమే ఫైనాన్సులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, బ్యాంకుల దివాలాలు, ఇదివరకే విశ్రాంతి కులాలవారికి అనుకూలంగా ఉన్న ఆర్థిక విధానాలు మరింత బహిరంగంగా ఆ వర్ణాలను కాపాడే దిక్కు పయనిస్తున్నాయి. కొందరు బీసీ కులాలవాళ్ళు ఎదుగుతున్నట్లు అనిపిస్తున్నది. వాళ్ళు విశ్రాంతి కులాల వారి పరిమితులకు లోబడి ఉండటమే. గ్లోబల్ మాయవల్ల ఫ్యాక్టరీలు మూతబడి అందులో చిన్నచిన్న ఉద్యోగులుగా ఉన్న బీసీలు ఉద్యోగాలు కోల్పోయి రోడ్లమీద నిలబడుతున్నారు. బీసీల కళలు, సాహిత్యం మరుగున పడిపోయి బీసీ సంస్కృతే విధ్వంసానికి గురవుతోంది. చదువు వ్యాపార సరుకైంది. ఉన్నత విద్య, పాఠశాల విద్య వేలాది రూపాయలు లేనిదే లభించే స్తితిలో లేదు. ఇంత డబ్బు పెట్టి గ్రామీణ బీసీలు తమ పిల్లల్ని చదివించుకోగలరా? దీనివల్ల లాభపడ్తున్నది బీసీలు మాత్రం కాదు.

బీసీలకు చెందాల్సిన సంక్షేమ పథకాలు రద్దు అవుతున్నాయి. సంక్షేమం మాట హాస్యాస్పదమై హాస్టళ్ళు, స్కాలర్‌షిప్పులు కూడా రద్దయ్యే ప్రమాదమేర్పడుతోంది. పశువులు పేడకు ఆమడదూరంలో ఉండే వాడు పాలఫ్యాక్టరీ, నాగలి సాలంటేందో ఎరుగని వాడు వందలాది ఎకరాలకు యజమానవుతున్నారు. దేశీయ, ప్రాంతీయ, మనవైన ఆర్థిక, సాంస్కృతిక వనరులన్నీ మూసివేయడం వల్ల బీసీలు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడుతున్నారు. తత్ఫలితమే పత్తి, పొగాకు, వేరుశెనగ రైతుల, చేనేత కార్మికుల, విద్యార్థుల, చేపల రైతుల ఆత్మహత్యలు.

చదువుతోపాటు ఆహారం, నీళ్లు, తుదకు జీవితమే వ్యాపార సరుకుగా మార్చిందీ గ్లోబల్ మాయ. రెండు రూపాయలకు గ్లాసెడు నీళ్ళు కొనుక్కునే స్థితి కల్పించిన ప్రపంచీకరణ బీసీల కొరగబెట్టిందేమిటీ? గ్రామాలను నాశనం చేస్తూ మన జీవన మాల్యాలన్నింటినీ భ్రష్టుపట్టిస్తున్న ప్రపంచీకరణ మాయనెదుర్కోకుంటే బీసీలకు బతుకు లేదు. బీసీల చదువు, కంప్యూటర్, రాజకీయాల్లాంటి అన్నిరంగాల్లో దూసుకుపోతూనే తమ ప్రత్యేకతను కాపాడుకునే ఆర్థికవనరులైన వృత్తిపనులను రక్షించుకుంటే ప్రబలమైన శక్తిగా ఎదుగుతారు. వస్త్రవ్యాపారం, పాలవ్యాపారం, మాంసం అమ్మకం, చేపల వ్యాపారం, పండ్లతోటల పెంపకం, కూరగాయలు పండించడం లాంటి వాటిని మించి ఆదాయ వనరులు ఏమున్నాయి? ఇవి వృత్తిపనులే కదా! పారిశ్రామికీకరణ జరిగినప్పుడు వృత్తుల్లో జరిగిన విధ్వంసం కంటే ఎన్నో రెట్లెక్కువ. ప్రపంచీకరణతో జరిగే ప్రమాదాన్ని గుర్తించి జాగ్రత్తపడడంలోనే బీసీల ఎదుగుదల ఆధారపడుతుంది. ఈ విషయాల్ని ప్రపంచీకరణను సమర్థించే మేధావులు గుర్తిస్తే మంచిది. వృత్తులను ఆధునీకరించుకున్నవాళ్ళు అన్ని రంగాల్లోనూ ఎదిగారు.

(ఆంధ్రజ్యోతి 21-02-03)

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ. 140/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.
వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672
Designed & Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor** : V.Hanumantha Rao